PRAJAKALA.ORG
ప్రజాస్వామిక సాహిత్య పత్రిక

ప్రజా కళ

# ప్రజాకళ మొదటి సంచిక

తెలుగు ప్రజల నుండి వినబడుతున్న ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక సాహిత్యానికి అంతర్జాతీయ గొంతునిచ్చే ప్రయత్నం మా ఈ 'ప్రజాకళ'



ఏ దేశచరిత్ర చూచినా
ఏమున్నది గర్వకారణం?
నరజాతి చరిత్ర సమస్తం
పరపీడన పరాయణత్వం


http://www.PrajaKala.Org

ప్రజాకళ. ఆర్గ్

editor@prajakala.org

# సూచిక


ప్రజాకళ గురించి ........................................ 3

కథ:

అశ్వమేధ యాగం - శ్రీశ్రీ ........................................ 5

కవితలు:

ఆ ఎత్తున పచ్చగడ్డి - దేవీప్రియ ........................................ 8

సైకిలూ - మూడు కవి సమయాలు - వరవరరావు ........................................ 9

స్వప్న శకలం - జి. వెంకటకృష్ణ ........................................ 11

కథ:

వెన్నెల పడవ - కె.వి.కూర్మనాథ్ ........................................ 13

సాహిత్య వ్యాసాలు:

కవిత్వం – సమాజం - ఎ.నాగరాజు ........................................ 17

ప్రపంచీకరణ – కొత్త కోణాలు – కథాప్రక్రియ - ఎన్ వేణుగోపాల్ ........................................ 22

ఇంటరువ్యూ:

'కనిపించే పదం' - కల్పన రెంటాల తో ముఖాముఖి - హిమబిందు ........................................ 31

అనువాదం:

ఒక అనాది నేరం - లెనార్డ్ పెల్టియర్............... 38

సాహిత్యవార్త

2006 సాహిత్య నోబెల్ గ్రహీత - ప్రజాస్వామిక లౌకిక విలువల కోసం నిలబడ్డ ఒర్హాన్ పాముక్!. 40

ప్రపంచ సాహిత్యం:

అయితే ఏంటి? పాలస్తీనా కవి: తాహా మహమ్మద్ అలీ - సాజీ గోపాల్ .....................42

# ప్రజాకళ గురించి

పాఠకులకూ, సాహిత్యాభిమానులకూ, నమస్సులు !

ఇవాళ తెలుగులో అంతర్జాతీయ ప్రమాణాలతో, ప్రపంచంలో యితరయే భాషలో వస్తున్న సాహిత్యానికీ తీసిపోని విధంగా అద్భుతమైన సాహిత్యం సృష్టింపబడుతోంది. అన్ని రకాల సామాజిక అసమానతలకు వ్యతిరేకంగా ప్రజలు వ్యక్తం చేస్తున్న ప్రజాస్వామిక ఆకాంక్షలు ప్రతిఫలిస్తూ గొప్ప సాహిత్యం తెలుగులో వస్తున్నది. అయితే వైవిధ్యభరితమైన ప్రజల ఆకాంక్షలను యింత అద్భుతంగా ప్రతిధ్వనిస్తున్న తెలుగు సాహిత్యం అంతర్జాతీయంగా వినబడటం లేదు. యితర భాషల వాళ్ళకోసం తెలుగు సాహిత్యాన్ని అనువదించటం వొక అంశమైతే. యితర ప్రాంతాలలో, యితర దేశాలలో విస్తారంగా నివసిస్తున్న తెలుగు ప్రజలకు నేడు తెలుగులో వస్తున్న యీ ప్రత్యామ్నాయ, సమకాలీన, ప్రజాసాహిత్యాన్ని అందించడం కూడ అంతే ముఖ్యమైనది. ఇవాళ ఇంటర్నెట్ మీద చాల పత్రికలు ఉన్నా వాటిలో సాహిత్యానికి కేటాయించబడుతున్న జాగా కొంచెమేనని చెప్పకోవాలి.

అంతర్జాతీయంగా వున్న తెలుగు సాహిత్యాభిమానులకు, ప్రజాస్వామికవాదులకు, తెలుగులోని సమాంతర సాహిత్యాన్ని యెప్పటికప్పుడు అందజేయడం వలన యెంతో కొంత మేలు జరుగుతుందని మేము భావిస్తున్నాము. అందువలన తెలుగు సాహిత్యానికి వొక అంతర్జాతీయ వేదిక యేర్పడాలనీ, ఆ వేదికలో అనేక ప్రజాస్వామిక ఆకాంక్షలను వ్యక్తం చేసే సాహిత్యం వెల్లివిరియాలనీ మేము భావిస్తున్నాం. ఈ ఎలక్ట్రానిక్ యుగంలో ఎక్కువ మంది తెలుగు వాళ్ళకు (ముఖ్యంగా విదేశాలలో వున్న వాళ్ళకు) అతి తేలికంగా అందుబాటులో నున్న మాధ్యమం ఇంటర్నెట్. ఇవాళ వరల్డ్ వైడ్ వెబ్ ఆధారంగా అనేక భాషలలో సాహిత్యం విస్తారంగా ప్రాచుర్యంలో వుంది. తెలుగు సాహిత్యాన్ని కూడా వెబ్ లో వుంచడం వలన ప్రపంచ వ్యాప్తంగా వున్న తెలుగు వారికి అది అతి తొందరగా చేరే అవకాశం ఉంది. అట్లా సమకాలీన తెలుగు సాహిత్యాన్ని వెంటవెంటనే దేశదేశాలలో వున్న తెలుగు ప్రజలు చదవడం వీలవుతుంది.

అందుచేత తెలుగులో ప్రజాస్వామిక సాహిత్యం పట్ల ఆసక్తీ, ప్రేమా వున్న కొంతమందిమి మేము ఈ వెబ్ సైటు ప్రారంభిద్దాం అని అనుకున్నాము. దీని ద్వారా వున్నత ప్రజాస్వామిక విలువలుగల తెలుగు సాహిత్యాన్ని అంతర్జాతీయ తెలుగు ప్రజలకు అందిద్దామని మా లక్ష్యం.

అంతేగాక దేశదేశాల్లో, అనేక భాషల్లో విరివిగా వస్తున్న ప్రత్యామ్నాయ ప్రజాస్వామిక సాహిత్యాన్ని తెలుగు సాహిత్యాభిమానులకు పరిచయం చేయాలని కూడ మా కోర్కె . అట్లా మీ దృష్టికి వచ్చిన సాహిత్యాన్ని మాకు తెలియచేస్తే మేము మా శాయశక్తులా దాన్ని వెబ్ సైట్ లో వుంచుతాము. దీన్ని వొక మాస పత్రికగా

తీసుకురావాలని మా ప్రయత్నం. అయితే ప్రతి వారం యేదో ఒక కొత్త రచనతో సైటుని అప్ డేట్ చేస్తూ తాజాగా వుంచాలని అనుకుంటున్నాం. కవిత్వం, కథ, నవల, సాహిత్య వ్యాసాలు, సాహిత్య విమర్శ తదితర రచనలను ప్రజాకళ ద్వారా పరిచయం చేస్తాం.

వొకమాట. మేం ప్రజాకళ లో తెలుగు నేలమీదనున్న అన్ని ప్రజాస్వామిక ఆకాంక్షలను ప్రతిఫలించే సాహిత్యానికి జాగా కల్పించాలనుకుంటున్నాము. విభిన్న ప్రాంతాల, విభిన్న సమూహాల, విభిన్న అస్తిత్వాల – యేదైనా అసమానతకు గురవుతున్న ప్రజల కష్టాలనీ కలలనీ ప్రతిబింబించే సాహిత్యం తీసుకు రావలని ఆశిస్తున్నాం. అయితే మేము వీలైనంతగా సాహితీ వివాదాలకు దూరంగా ఉండదలచుకున్నాము. ప్రజాకళ సృజనాత్మక ప్రజాసాహిత్యానికి అంతర్జాతీయ వేదిక కావాలని మాగట్టి కోరిక.

మీ అభిప్రాయాలు, స్పందనలు, సలహాలు మాకు తెలియ జేయవలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాం ! మీ అభిప్రాయాలను ప్రతీ పేజీలో కిందనున్న కామెంట్స్ ద్వారా గాని లేదా editor@prajakala.org కు ఈ-మెయిల్ ద్వారా గాని పంపవచ్చు.

# అశ్వమేధ యాగం

- శ్రీశ్రీ

:కథ

"అమ్మకి ప్రాణంమీద కొచ్చింది. వెంటనే బయల్దేరు – రామం."

తమ్ముడిచ్చిన టెలిగ్రాం చదువుకున్నాడు వెంకటేశ్వర్లు. ఒక్కక్షణం మటుకు మనస్సులోని ఊహలన్నీ స్తంభించి మెదడు శూన్యమయింది. కత్తిపేటుకి చర్మం తెగితే వెంటనే రక్తం రాదు. రక్తం రావడం ప్రారంభించడంతో వరదగా ప్రవహిస్తోంది.
ఊహలు వరదలుగా ప్రవహిస్తున్నాయి. "...... అమ్మ చచ్చిపోతుంది కాబోలు. సాయంత్రం మెయిలులో బయల్దేరడానికి వీలు లేదు. రేపే వెళ్ళవచ్చు. చచ్చిపోదు. ఫరవాలేదు. రేపే వెళతాను. మరి డబ్బు? "
తలకాయలో పందెపు గుర్రాలు పరుగెత్తుతున్నాయి.
డబ్బు సంగతి తలలో మెరసిన వెంటనే "ఈ టెలిగ్రాముతోనే డబ్బు పోగుచెయ్యవచ్చు" ననే ఊహ పుట్టింది. ఒకచోట కాదు. పదిచోట్ల సొమ్ము చెయ్యవచ్చు. తల్లి చచ్చిపోతోందంటే డబ్బు బదులివ్వని కఠిన హృదయులుండరు. నలుగురైదుగురు బిర్రబిగసినా, ఐదారుగురైనా ఇచ్చి తీరుతారు. సుమారు నూరు రూపాయలు పడతాయనడానికి సందేహం లేదు.

వెంటనే  బట్టలు వేసుకున్నాడు. దమ్మిడీ అయినా లేదు. దగ్గరలో ఉన్నవాడూ, అడ్డగానే అప్పు యిచ్చేవాడూ ఎవరనీ ఆలోచించాడు. మరెవరు? సత్యనారాయణ ఉన్నాడు. నాలుగు వీధుల అవతల. నడుచుకుపోవచ్చును. ఈ కష్టసమయంలో పెళ్ళాం మెళ్ళో నగ తాకట్టుపెట్టి అయినా ఖర్చు తెమ్మని అడగదగినంత చనువూ, అవకాశం ఉన్నాయి."సత్యనారాయణ గారూ! ""ఇంట్లో లేరండీ! "
ఏం అపశకునం! ఇంత పెందరాలే ఎక్కడికి వెళ్ళిపోయాడో?  అన్నట్టు టెలిగ్రాము గదిలో వదిలిపెట్టలేదు కదా. జేబు తడుముకున్నాడు. ఉంది. జేబులోనే ఉంది.
మరి ఈ సత్యనారాయణ ఎక్కడ దొరుకుతాడు? కాఫీ క్లబుల్లోనా? తన జేబులో రెండణాలయినా ఉంటే బాగుండును. అబ్బే కాఫీ క్లబ్బుకి వెళ్ళడు. "ఇంట్లో కనుక్కుందాం. చెప్పి వెళతాడా? ఏమో....... అడిగి చూదాం."

"సెంట్రలుస్టేషను కెళ్ళారండి. వచ్చాక మీ రొచ్చినట్టు చెబుతాను." ఇంట్లో నుండి జవాబు. వీధికొసని తనకి తెలిసిన సోడా దుకాణం నాయర్ దగ్గర ఒకపావలా తీసుకున్నాడు వెంకటేశ్వర్లు. బస్సులో పడ్డాడు. నిలబడే ప్రయాణం చేశాడు. గుర్రాలు మరీ జోరుగా పరుగెడుతున్నాయి మనస్సులో.

ప్లాటుఫారం మీద సత్యనారాయణను కలుసుకున్నాడు. ఇంకా మెయిల్ రాలేదు. ‘‘మా బావమరది వొస్తున్నా’’డని సత్యనారాయణ ప్రకటించాడు. ఎలా ప్రారంభిస్తే బాగుంటుంది? ‘‘మీ ఇంటికి వెళ్ళితే నువ్వు లేవు.

అర్జంటు పని మీద వొచ్చాను.’’ అంటే? కుర్రాడు పెన్సలుగీతలు రబ్బరు పెట్టి తుడిచివేసినట్లు మనస్సులోంచి ఈ మాటలను తుడిచివేశాడు. ఏమీ అనకుండా జేబులోంచి వైరుతీసి సత్యనారాయణ కిచ్చాడు.
‘‘అరే, పాపం! మీ అమ్మకి జబ్బుగా ఉన్నట్లు వినలేదే!’’

వృద్ధాప్యమే జబ్బు. బతకదు. లాభం లేదు. సాయంత్రం మెయిలుకి వోదామనుకుంటున్నాను.’’ సత్యనారాయణ చూపులు శూన్యాన్ని చిన్న చిన్న పీలికలుగా తుంచుతున్నాయి. ‘‘వెడదామంటే డబ్బులేదు ……..’’ ఎవ్వరో నూతిలో పడిపోయినట్టు ఈ మాటలన్నాడు వెంకటేశ్వర్లు తొందరగా.

సత్యనారాయణ కుడిచేతి బొటనవ్రేలినీ, చూపుడు వ్రేలిని చాచి నుదుటిని పట్టుకొని ‘‘పాతిక రూపాయలేనా ఉండాలనుకుంటాను’’ అన్నాడు. ముప్పై రూపాయలు కావాలి. నువ్వే ఇవ్వాలి. ఎంత ముంచుకొచ్చినా ఎవరినీ నోరువిడిచి అడగలేను.’’

సత్యనారాయణది త్వరగా కరిగిపోయే గుండె. నగ తాకట్టు పెట్టి ఇస్తాననిపించడానికి వెంకటేశ్వర్లుకి ఐదు నిమిషాలకంటె ఎక్కువ పట్టలేదు. మధ్యాహ్నం రెండు గంటలకి మీ ఆఫీసులో కలుసుకుని సొమ్ము తీసుకుంటానని చెప్పి వెళ్ళిపోయాడు వెంకటేశ్వర్లు.
* * *
నరహరి సెట్టి దగ్గర పది రూపాయలు సంపాదించేసరికి తలప్రాణం తోకకు వచ్చింది.
* * *
టాక్సీ చేయించుకొని మైలాపూరు బ్యాంకుకి వెళ్ళాడు వెంకటేశ్వర్లు. బ్యాంకు గుమాస్తా కామేశం స్నేహితుడు కాడుగాని పరిచయస్థుడు. ఇలాంటి సన్నివేశాలలో స్నేహంకన్నా పరిచయమే డబ్బు పలికిస్తుంది. బ్యాంకులో అరగంట వ్యర్థమైపోయింది. దమ్మిడీ కూడా పెగలలేదు. టాక్సీని పంపించివేశాడు. అనవసరంగా డబ్బు వేటకి ఎక్కువ పెట్టుబడి పెట్టకూడదని నిశ్చయించాడు.
ఇద్దరు ముగ్గురు వకీలు స్నేహితుల ఇండ్లకు నడుచుకుంటూ వెళ్ళాడు. టెలిగ్రామ్ చూపించి ఒకచోట ఇరవై, ఇంకొకచోట ఇరవై ఐదు పిండుకున్నాడు.

మధ్యాహ్నం పండ్రెండు గంటలకి జేబులో డెబ్బయిఅయిదు రూపాయల జమ.
గుర్రాలు జోరుజోరుగా పరుగెత్తుతున్నాయి. సత్యనారాయణ ఇచ్చే ముప్పయి రూపాయలూ కలుపుకొని నూటఐదు రూపాయలవుతాయి. ఇవాళ గిండీకి వెళ్ళిపోతాను. గుర్రపు పందాల ఆఖరిరోజు. చీకటితో ఎక్సుప్రెస్ ఎక్కేస్తాను. ‘‘రెండు మూడు వందలేనా గెలవకపోతానా’’ అనుకున్నాడు వెంకటేశ్వర్లు. నిన్న సాయంత్రం కొన్న ‘‘రేసింగ్ గైడు’’ కోటులోపల జేబులోంచి పైకి తీశాడు. సైంటిఫిక్ గా ఆలోచించి గుర్తులు పెట్టుకున్న గుర్రాలపేర్లు

మరోమారు మననం చేసుకున్నాడు. ఇవాళ నువ్వు గెలిచి తీరుతావని ఎవరో రక్తంలోంచి సందేశాలు పంపుతున్నట్లనిపించింది.

"మరి ఇంటికి వెళ్ళను. భోంచెయ్యాలని లేదు. టిఫిన్ తీసుకొని సత్యనారాయణ ఆఫీసుకి, అక్కణ్ణుంచే పార్కు స్టేషనుకీ".

ఎలక్ట్రిక్ ట్రెయిన్ లో కూర్చున్నాడు. ట్రెబిల్ ఈవెంట్ లో ఏడెనిమిది వందలొస్తే ఇవాళ చేసిన అప్పులన్నీ ఈ సాయంత్రమే తీర్చేస్తాను. కిందటి రేస్ లో ఈ నెల జీతమంతా తగలేశాను. అనుకున్న గుర్రాలని ఆడకుండా ఎవరో చెప్పిన మాట వింటే ఏమవుతుంది మరి?

"ఇవాళ ఫరవాలేదు. కళ్ళు మూసుకుని ఆడేస్తాను. పుట్టమీద పెట్టినట్టు డబ్బొచ్చేస్తుంది. ఫూల్ ప్రూఫ్ గా ఆలోచించాను. సైంటిఫిక్ గా అంచనా వేశాను. ఇవాళ నేను ఓడిపోవడానికి వీలు లేదు."

* * *

వెంకటేశ్వర్లు సాయంత్రం గిండీనించి మరలి వస్తున్నప్పుడు అతని జేబులో తొమ్మిదణాల చిల్లర డబ్బులు, రెండు సిగరెట్లున్న విల్సు పాకెట్టు, ఉదయం అందిన టెలిగ్రామూ మాత్రం మిగిలాయి. అతనెంత సైంటిఫిక్ గా ఆలోచించ గలిగినవాడైనా గుర్రాలకి ఆ సబబు లేవీ తెలియకపోవడమే అతని పరాజయానికి కారణం.

(ముద్రణ: కథావీధి 1945)

# ఆ ఎత్తున పచ్చగడ్డి

- దేవీప్రియ

గాలికి ఎగిరి ఆడుతున్న
మబ్బుల తలపాగా చుట్టుకున్న
కొండశిఖరంకొన మీద
కాలిబొటనవేళ్ళ మీద నిలబడి
ప్రేమిస్తా నా జీవితాన్ని, నిన్ను...

కొండకొమ్ము మీద
ఎవరికోసం మొలిచి నిలిచి వున్నదో
ఈ పచ్చగడ్డి...
ఏ ఉమరుఖయ్యాము జాలిపాటల
స్పర్శ కోసమో దాని ఎదురుచూపులు...
ఇంకా జన్మించని ఏ కోటానుకోటి దేవుడి మోక్ష అభయం కోసమో
దాని నిర్మల నిశ్చల నిరీక్షణ...
ఎవడో ఒక గంధర్వుడి దివ్యజవనాశ్వపు
మునిపళ్ళరంపాల మధ్య చూర్ణమయ్యే వరకు
ఇలాగే ఆకాశ గిరిశిఖరాల మీద నవనవలాడుతూ
ఆ పచ్చగడ్డి నిత్య నవనీతపునీత జీవనం...!

# సైకిలూ - మూడు కవి సమయాలు

- వరవరరావు

నేను హన్మకొండలో ఉండగా
ఇంటి ముందు
ముందుగా మోగే సైకిల్ గంటా
కనిపించే ముందటి పయ్యా
హ్యాండిల్‌పై ‘ట్రిగర్ పై వేళ్ళతోరా...’

అని నిర్ణయాత్మకంగా రాసిన
చేతివేళ్ళూ కనిపించగానే
కవి మిత్రుణ్ణి పోల్చుకుని బయటికి వచ్చేవాణ్ణి.

ఆయన నవ్వుతూ సైకిలు దిగి
‘నన్నెప్పుడూ నిరాశ పరచని మిత్రుడు’
అని గుర్రం జూలు నిమిరినట్లు నిమురుతూ
ఎంతో గర్వంగా తన సైకిల్ వైపు చూసుకునేవాడు.

* * * * *

కొత్త ఢిల్లీలో
మిలిటరీ ఇనుప కంచె బయట
ఒక ఎర్రసైకిలూ ఇనుపముళ్ళలో
చిక్కుకుపోయిన
ప్రియురాలికివ్వడానికి తెచ్చిన గోరింటాకు
రోజులట్లా చూస్తూ ఉండే కవి
సర్వేశ్వర్ దయాల్ సక్సేనాకు యవ్వన స్వప్నాలను
ఎమర్జెన్సీ ఏం చేసిందో ఎవ్వరూ చెప్పనక్కర్లేక పోయింది

* * * * *

సంక్షేమ పథకాల పోరాటమప్పుడు
పీఠభూమిని సైబర్ వరద ముంచెత్తినప్పుడు
రజిత తన సెక్కించుకుని తిప్పిన సైకిలు
అమరులు ఆజాద్, ప్రసాదుల నుంచి
ఆమె కొచ్చిన వారసత్వం అని విన్నపుడే
నాకర్థమయింది రజిత ఎంచుకున్న మార్గం

మరి ఇపుడా సైకిలు
ఆమె ఎవరికిచ్చి పోయింది?!

(రజిత కోసం... కాశీంకు కృతజ్ఞతలతో)

# స్వప్న శకలం

- జి. వెంకటకృష్ణ

అఖండమైందేమీ లేదని
స్వప్నం వొకటి కన్నాక
ఖండాలను సానబెట్టుకున్న
మనిషి కథ యిది

నీ జ్ఞాపకాల్లో నీవు
నీ వేదనల్లో నీవు
నీడలా నిలిచిన నీ ప్రతిబింబం
అద్దమై ఘనీభవించిన రూపం

శకలాలు అతుక్కున్న మాయాజాలంలో
అంగాంగాలూ అఖండమైన జ్ఞాపకం
అవనినీ ఆకలినీ యిముడ్చుకొని
రహస్య పొరలలో
స్వప్త దృశ్యాల ఛాయలో
ఎలుగెత్తిన ఒక ధిక్కారం

అఖండమైందేమీ లేదని
కలవరింత వొకటి పలకరించాక
ఖండ ఖండాలను పుటం పెట్టుకున్న
సమిష్టి కథ యిది
భౌతిక శక్తులు ఘర్షించిన దారుల్లో
ఆత్మిక శక్తులు సంధానించిన గమ్యాల్లో
దూరం ఎన్ని తరాలైనా
కాలస్మృతి పేటికలో
పేర్చుకుంటున్న శకలాలు

చర్యల చేనేతలతో
అతికిన వృత్తాలు.

అఖండమైందేమీ లేదని
కలవొకటి కన్నాక
శకలాలను కూర్చుకునే కథ యిది
సంకెళ్ళ అడ్డుగోడల మధ్యా
సుడిగుండాల సమాధుల మధ్యా
వీచి వర్షించే రుతుగానం
అల్పపీడనాల్ని సృష్టించుకున్న వేళ
కుంభవృష్టుల్ని భరించే యత్నం
అసమతౌల్యం పరుచుకున్న నేల
సంఘర్షించే కథనం .

శకలాలన్నీ అఖండం
అఖండంలో యిమిడిన శకలం
నీ పిడికిట దాగిన రహస్యం .

# వెన్నెల పడవ

- కె.వి.కూర్మనాథ్

:కథ

అవ్వ చెప్తే నమ్మలేదు గాని ఒకసారి నిజంగానే కలలోకొచ్చేడు చంద్రుడు. ఏడ్చి పడుకునే పిల్లలనాడించడానికి చంద్రుడు వస్తాడని, అసలు చంద్రుడి పనే అదని అవ్వ చెప్పేది. చంద్రుడు అందంగా కనిపిస్తూ హాయిగా అనిపించే వాడు. కానీ పిల్లలనాడిస్తాడనీ అతడికదే ప్రపంచమనీ అవ్వ చెప్తే ఆశ్చర్యమనిపించేది. చంద్రుడి గురించి రోజుకో కథ చెప్పేది. అసలు చంద్రుడు ఒక్కడు కాదనీ ఆకాశానికి పద్నాలుగుమంది చంద్రుళ్లు సంతానమనీ చెప్పింది. పిల్లలనాడించే పని రోజుకొకరు చేస్తారనీ, అమావాస్య తర్వాత రోజు మొదలుపెడితే పున్నమివరకూ రోజుకొకరు వంతులేసుకుంటారనీ చెప్పింది. ఒక్క అమావాస్యరోజు మాత్రం రెస్టు తీసుకుంటారట. ఆరోజు వాళ్ల ఫ్రెండ్స్ అయిన చుక్కలు లక్షలకొద్దీ పొడుచుకొచ్చి చంద్రుడు లేని లోటు తీరుస్తాయట.

ఇంకోరోజు చెప్పిందీ, సూర్యుడు, చంద్రుడు అన్నదమ్ములని. పిల్లలు పగటిపూట ఆడుకోడానికి సూర్యుడు వెలుతురునిస్తే, చంద్రుడు రాత్రిపూట పిల్లలతో చేరి ఆడుకుంటాడని. ఈ కథలు వింటూ వింటూ చంద్రున్ని చూస్తుంటే వింతగా అనిపించేది. కొత్తగా అనిపించేది. అవ్వచెప్పిన సంగతులేవో చెప్పని విషయాలేవో తోచేవి.

ఒకరోజు చెప్పిందీ, అసలు కురిసే వెన్నెలంతా పిల్లల కోసమేనని. పిట్టలకోసమేనని. ఎగిరే దూడలకోసమని. విచ్చుకునే మొగ్గల కోసమని. తను జలపాతంలా కురిపిస్తున్న వెన్నెలలో పిల్లలు తడిసి ముద్దయితే చంద్రుడికి చాల యిష్టమని చెప్పేది. విప్పారిన కళ్లతో పిల్లలు తనవైపు చూస్తుంటే చంద్రుడికి చాల యిష్టమట. అలా చూసే పిల్లలలు ఒక్కొక్కళ్లకు ఒకోరకంగా కనిపించేవాడు. ఒకరికి వెండి బంతి లాగా, మరొకరికి ఆకాశానికి పెట్టిన బొట్టులాగా, తియ్యటి పాల కోవా లాగా, అందమైన ఆల్చిప్పలాగా, బుడగ లాగా కనిపించేవాడు. పున్నమిరోజుల్లో అయితే అలాగ. మిగతా రోజుల్లో అయితే మంచుజారుడు బండ లాగా, అద్దం ముక్కలాగా, పక్షి ఈకలాగా, వెన్నెల ఊయల లాగా, మెరుపు ముక్కలాగా అనిపించేది.

ఈ కథలు వినడానికి అన్నం తిన్నవెంటనే యింటి ఎదురుగా వున్న అవ్వ గుడిసెలోకి చేరేవాడ్ని. అప్పటికే అన్నం తిని గుడిసె బయట నులకమంచం మీద కూచుని చుట్ట కాలుస్తుండేది. నేను పక్కనే చేరేవాడ్ని. నేనెందుకోసం వస్తానో తెలుసు తనకు. చెప్పిన కథ చెప్పకుండా చెప్పేది. ఎన్ని కథలు చెప్పినా చంద్రుడి గురించిన కథలు బాగా అనిపించేవి. ఎందుకంటే ఆ కథలు చెప్తున్నప్పుడు ఎదురుగా చంద్రుడుండేవాడు కాబట్టి.

'పీల్చుకున్న నీటిని అరాయించుకోడానికి మొక్కలకు సూర్యుడెలా తోడుంటాడో, మంచి మంచి కలలతో హాయిగా పెరగడానికి చంద్రుడలా తోడుంటాడు' అని అవ్వ చెప్పేది.

అవ్వ చెప్పేది నిజమో కాదో తెలుసుకోవాలనిపించేది. ఒకరోజు అవకాశం రానేవచ్చింది. ఇంట్లో చెప్పకుండా ఏటికి స్నానానికి వెళ్లేనని నన్ను ఒకరోజు బాగా కొట్టేడు. ఎప్పుడూ నన్ను వెనకోసుకొచ్చే నాన్నమ్మ కూడా నాన్నను అడ్డుకునే ప్రయత్నం చెయ్యలేదు. నాకేమైనా అయి వుండేదన్న భయంతో కావచ్చు. కొడితే మరోసారి అలా చెయ్యకుండా వుంటానని కావచ్చు. నాన్న కొట్టినందుకు కంటె నాన్నమ్మ మౌనమే ఎక్కువ బాధపెట్టింది నన్ను. దు:ఖం సుళ్లు పెడుతుంటే ఏడుస్తూ పడుకున్నాను, అన్నం తినకుండానే. నిద్రపట్టినా ఉక్రోషం తగ్గలేదు.

ఎంతసేపయిందో తెలీదు గాని నేను సాయంత్రం ఆడుకున్న ఏటివార ఇసుకతిన్నెల మీద ఒక ఉయ్యాల లాగా నెలవంక దిగింది. రమ్మంటున్నట్టు ఊగితే మెల్లగా నడుచుకుంటూ వెళ్ళేను దాని దగ్గరికి. ఇంకో నలుగురైదుగురు పిల్లలు అప్పటికే దానిమీద ఎక్కి కూచున్నారు. నన్నూ ఎక్కమన్నారు. నేను ఎక్కేక మెల్లగా ఉయ్యాలలాగా ఊగుతూ గాలిలోకి లేచింది. రాత్రి సముద్రంలో పడవలాగా కదులుతూ పోతోంది. నాచుట్టూ వున్న పిల్లలు కేరింతలు కొడుతున్నారు. నేను కూడా వారితో జతకలిసేను. నాల్గురోజుల వయసు నెలవంక విడుస్తున్న లేత వెన్నెలలో ఏరు, ఏటిపక్కన కొండలు, మామిడి తోటా, మా ఊరూ ఒక పెయింటింగ్ లాగా అనిపిస్తోంది. ఇంకా కొన్నిచోట్ల దిగి మరి కొందరు పిల్లల్ని ఎక్కించుకున్నాక మళ్ళీ మా పడవ ఆకాశంలోకి ఎగిరింది. చాల ఎత్తుగా. ఎంత ఎత్తుగా అంటే ఇప్పుడు కింది కొండలూ ఊళ్ళూ నదులూ దాదాపు కనిపించడమే లేదు.

మేఘాలలోంచి పడవ దోబూచులాడుతూ వెళుతూ వుంటే పిల్లలందరూ ఒకటే అరుస్తున్నారు. చేతులు బయటకు పెట్టి మేఘాలను పట్టుకోజూస్తున్నారు. నేను కూడా చెయ్యి బయటకు పెట్టేను. చల్లటి నీటి గాలి చేతికి తాకింది. ఒక మేఘపు గుంపును దాటి బయటకొచ్చేమో లేదో దూరంగా మరొకటి కనిపించింది. పిల్లలందరూ ఆనందంతో ఓ ఓ అరుస్తున్నారు. మా పడవ మరో మేఘపు గుంపు దగ్గరకు వెళ్తుండగా హఠాత్తుగా దాంట్లోంచి చాలా పెద్ద మనుష్యాకారం బయటకొచ్చింది. పిల్లలందరూ దాన్ని చూసి భయపడి 'ఓవ్' అని అరిచేరు. మా అరుపులకు బ్రేక్ వేసినట్టు పడవ ఒక్క కుదుపుతో ఆగిపోయింది. మేఘాలమధ్యలోంచి బయటకొచ్చిన ఆ ఆకారం మావైపే వస్తోంది. పిల్లలందరూ భయంతో మళ్ళీ గట్టిగా అరిచేరు. కనిపించీ కనిపించని వెలుతుర్లో చూస్తే ఎక్కడో చూసినట్టే అనిపించింది. నాన్ననా? అవును నాన్నే! నేనింకా ఆశ్చర్యంలోంచి తేరుకోక ముందే కోపంగా చూస్తూ "చెప్పకుండా ఎందుకెళ్ళేవు ఏటికి?" అనడిగేడు. భయంతో పడవ అంచుల్ని గట్టిగా పట్టుకున్నాను. భయపడ్డారో లేకపోతే వాళ్ళకూ ఏమైనా భయాలు గుర్తొచ్చేయో తెలీదు గాని వాళ్ళు కూడా పడవను కరుచుకు కూచున్నారు. ఎత్తులూ లోతులూ దూరాలూ లేకుండా అనంతంగా వున్న ఆకాశంలో హాయిగా సాగుతున్న మా విహారయాత్ర అర్థాంతరంగా నా వల్ల ఆగిపోయినందుకు బాధవేసింది. మిగితా పిల్లల ముందు చిన్నతనం అనిపించింది. నాన్న యింకా కోపంగానే చూస్తున్నాడు. ఈ విపత్తు ఎలా తప్పుతుందో అర్థం కాలేదు. లేకపోతే ఈ యిబ్బందికరమైన పరిస్థితిలో అనంతంగా చిక్కుకుపోయానో?

ఈ యిబ్బందిని గమనించిందో ఏమో నెలవంక తనే మెల్లగా కదలడం మొదలెట్టింది. మెల్లమెల్లగా వేగం అందుకుంది. నాన్న ఉనికిని లెక్కచెయ్యనట్టు పట్టించుకోనట్టు పైకి, పైపైకి ఎగిరింది. ఇదివరకటి భయం తాలూకు ఛాయలను క్రమక్రమంగా అక్కడే వదిలేసి మళ్ళీ అందరం మేఘాల గుంపుల్లోంచి విహరించేం. ఏనుగుల మందల వలె, చెట్ల వలె, మంచునదుల వలె, వెన్న ముద్దల వలె, వెండి పరుపులవలె వున్న మబ్బులను దాటుకుంటూ నక్షత్రాల దాపులకు వెళ్లేం.

అవును అవ్వ చెప్పింది నిజమే చుక్కలు చంద్రుడికి ఫ్రెండ్సే. పడవనక్కడ ఆపించి మమ్మల్ని దింపి ఏవేవో ఆటలు ఆడించేయవి. ఒక పాపయితే చుక్కలన్నింటినీ దగ్గరకు చేర్చి పాదం మీద పోసి చుట్టూ చేతులతో మెల్లగా ఒత్తు చుక్కలగూడు కట్టి మెల్లగా కాలు తీసేసింది. అట్లా ఆ చుక్కల లోకంలో ఎంతసేపు ఆడుకున్నామో తెలీదు. నిద్ర బాగా పట్టిందో, కలే ముగిసిపోయిందో లేకపోతే దు:ఖాన్ని మాన్పిన స్వాంతన దొరికిందో తెలీదు గాని ఆ తర్వాత ఏమైందో గుర్తులేదు.

ఇది జరిగి ఎన్నో ఏళ్ళయింది. చంద్రుడితో ఆనాటి చెలిమి ఎప్పుడు తెగిపోయిందో గుర్తేలేదు. అవ్వ చెప్పేది బాల్యం గడిచిపోతే ఇక పిల్లలకు చంద్రుడిలోకంతో సంబంధం వుండదని. బాల్యం గడిచేక చంద్రుడి సావాసం తెగిందో, చంద్రుడి సావాసం పోయేకనే బాల్యం పోయిందో తెలీకుండానే రోజులు గడిచిపోయేయి. నిండుపున్నమి వెన్నెల్లో బీచ్ లో కూచుని చూస్తూ వుంటే సముద్రాన్ని వెండినీళ్ళల్లా మార్చే చంద్రుడు ఇప్పటికీ వింతగానే అనిపిస్తాడు. కానీ చిన్నప్పటి చెలిమే వేరు.
ఏమాటకామాటే చెప్పుకోవాలి. ఒకరోజు చంద్రుడితో అదివరకెన్నడూ లేని అనుభవం కలిగింది. ఎప్పుడూ ఫ్రెండ్ లాగా చాలా ఆత్మీయంగా కనిపించే చంద్రుడు నావైపు ఎన్నడూ లేనంత తిరస్కారంగా చూసేడు. కోపంతో తలతిప్పుకు వెళ్ళిపోయేడు. అదెప్పుడో చెప్తాను.

ఒకరోజు ఆఫీసునుంచి వస్తూనే సబ్బు కొరుకుతూ కనిపించేడు నా మూడేళ్ళ కొడుకు. అంతే కోపం పట్టలేకపోయేను. ఒక్క ఉదుటున వెళ్ళి రెండు వేసేను. దెబ్బల నెప్పికంటె నేను కొట్టేనన్న విషయం వాడిని ఎక్కువ బాధ పెట్టినట్టుంది. ఐదారు సెకన్లు దు:ఖం అదిమిపెట్టుకుని పెద్దపెట్టున ఏడవడం మొదలుపెట్టేడు. ఒక రెక్క పట్టుకు లాక్కెళ్ళి నల్లా దగ్గర మూతి శుభ్రంగా కడిగేను. వాడు ఏడవడం ఆపలేదు. వాళ్ళమ్మ కూడా వాడిని సపోర్టు చెయ్యకపోవడంతో వాడికి యింకా ఉక్రోషం కలిగింది. నేను బట్టలు మార్చుకుని స్నానం చేసి వచ్చే సరికి వాడు ఒక్కడే మంచం మీద చేరి పక్కకు తిరిగి పడుకుని ఎటో చూస్తూ ఆలోచిస్తున్నాడు.

వాడు సబ్బుతింటే ఏం జరిగి వుండేదన్న భయంతోనో, వాడిని కొట్టేనన్న బాధతోనో అన్నం తినబుద్ధి కాలేదు. కాస్త తిని వాడిపక్కనే పడుకున్నాను. దగ్గరకెళ్ళి బొజ్జమీద చెయ్యివేసి సబ్బుతింటే ఎంత ప్రమాదమో చెప్దామనుకున్నాను. నేను చెయ్యి వెయ్యగానే విసురుగా తోసేసాడు. రోజంతా నేనొస్తానని ఎదురుచూసి ఎదురుచూసి తీరా నేనొచ్చాక జరిగినదాంతో కోపంతో వున్నట్టున్నాడు. కాసేపటికి నిద్రపోయేడు- నన్ను కథ చెప్పమని అడగకుండానే. నాకూ నిద్రపట్టేసింది. ఎంత రాత్రయిందో ఏమో గానీ కలతనిద్రలో అటూ యిటూ

దొర్లుతున్నాను. ఏదో కల వస్తూ వస్తూ కలతనిద్ర వల్ల సరిగ్గా కొనసాగడంలేదు. ఆ కలలో నేను పదులూ వందల రెట్లు పెద్దగా కనిపిస్తున్నాను. చూస్తూ చూస్తూ యింకా పెరిగిపోతూ వున్నాను. నేను పెరుగుతున్నానో లేకపోతే గాలిలో ఎగురుతున్ననో స్పష్టంగా తెలియడంలేదు గాని క్రమంగా మేడలూ చెట్లూ, కొండలూ యిప్పుడు నాకు చాల చిన్నవిగా కనిపిస్తున్నాయి. నా చేతికి ఏదో చల్లగా అనిపిస్తే ఏమిటా అని చూసేను. నీటితో చెమ్మగిల్లిన మేఘమొకటి చేతిని తాకుతూ పోతోంది. చుట్టూ చూస్తే సబ్బునురగల్లా కనిపిస్తున్నాయి మేఘాలు. సబ్బు బుడగల మేఘాల్లో దూరంగా పడవలాగా కదులుతూ చంద్రవంక కనిపించింది. దగ్గరకెళ్ళి చూసేను. చంద్రవంక మీద చాలామంది పిల్లలు కనిపించేరు. వాళ్ళ కేరింతలతో అక్కడంతా చాలా సందడిగా వుంది. నీటి ఆవిర్లతో కూడుకున్న మేఘాల గాలులలో వాళ్ళు సరిగ్గా కనిపించకపోతే మరింత దగ్గరగా వెళ్ళేను. ఇప్పుడు స్పష్టంగా కనిపిస్తున్నారు వాళ్ళంతా. సబ్బు నురగల్లో చేతులూపుతూ ఒకరిపై మరొకరు జల్లుకుంటున్నారు.

మబ్బుల చాటునుంచి హఠాత్తుగ ప్రత్యక్షమైన నన్ను చూసేరు వాళ్ళు. కేరింతలు కొడుతున్న వాళ్ళంతా ఒక్కసారి అవాక్కయిపోయారు. భయంతో వణుకుతూ చంద్రవంకను గట్టిగా పట్టుకున్నారు. అప్పటిదాకా కదులుతున్న పడవ బ్రేక్ వేసినట్టు ఆగిపోయింది. అప్పుడు చూసేను ఆ పిల్లల్లో మా బాబును. వాడి ముఖమ్మీద చేతులమీద మేఘాల నురగ కనిపించింది. వాడు నావైపు భయం భయంగా చూస్తున్నాడు. నాకు వెంటనే సబ్బుతిన్న సంగతి గుర్తొచ్చింది.

“చెప్పు, సబ్బెందుకు నోట్లో పెట్టుకున్నావ”ని గట్టిగా గదమాయించేను. వాడు బిక్క చచ్చిపోయేడు. మిగితా పిల్లలు కూడ వణుకుతున్నారు ఏం చెయ్యాలో తెలియక. ”చెప్పూ”అన్నాను మళ్ళీ గట్టిగా. జవాబుగా ఎడమచెయ్యి ఎత్తి గాల్లో తిప్పుతూ “నువ్ పో” అన్నాడు. చంద్రవంక నావైపు చాల కోపంగా చూసింది. తల తిప్పుకుంది. మరుక్షణంలోనే కదిలింది. మెల్లగా పైకి ఎగిరి వేగం అందుకుంది. అప్పటిదాక పెరుగుతూ వున్న నేను అంతకంటె యిక పెరగలేకపోయేను. చూస్తుండగానే వాళ్ళు మేఘాల్ని దాటి చుక్కల దగ్గర కెళ్ళిపోయేరు.

ఒక్క సారి నా కల చెదిరిపోయింది. పక్కకు తిరిగి చూసేను. నిద్రలో నవ్వుతూ కదులుతున్నాడు వాడు. బహుశ చుక్కల లోకంలో దిగినట్టున్నారు పిల్లలు అనుకున్నాను.

(ఎప్పటెప్పటి ఊహలకు ఒక రూపాన్ని సూచించిన శ్రీకాంత్‌కు కృతజ్ఞతలతో)

# కవిత్వం – సమాజం

-ఎ.నాగరాజు

వివిధ సాహిత్య ప్రక్రియలతో పోలిస్తే కవిత్వానికి కొన్ని ప్రత్యేకతలున్నాయి. కవిత్వానికున్న ఈ ప్రత్యేకతల కారణంగానే మిగిలిన అన్ని సాహితీ ప్రక్రియల కన్నా ముందుగానే అది సామాజిక వాస్తవికతకు అనుగుణంగా ప్రతిస్పందించగలుగుతుంది. సామాజిక వాస్తవికతకు అనుగుణంగా తలెత్తే వివిధ ధోరణులు, సామాజిక ఉద్యమాలకు కవిత్వం అడుగుజాడ కాగలుగుతుంది. కవిత్వం మాత్రమే నిర్వర్తించగల ఈ విశిష్ట పాత్రను వివరించడానికి సాహిత్య చరిత్రలోని వివిధ కీలక సందర్భాల నుండి ఎన్నో ఉదాహరణలను చెప్పవచ్చును.

కవిత్వం ఈ రకమయిన పాత్రను నిర్వహించడానికి దానిలో ఉన్న సామాజికాంశే ప్రధాన కారణం. ఈ సామాజికాంశ గూడా మిగిలిన సాహితీ ప్రక్రియలలో కనిపించే సామాజికాంశం కంటే కొన్ని ప్రత్యేకతలను కలిగి ఉంటుంది. కవిత్వం మానవోద్వేగాలు, అనుభూతులు కలగలిసి నిర్మాణపరంగా ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. మనిషి తన తొలినాళ్ళలో చుట్టూ ఉన్న బాహ్య వాస్తవికతను అర్థం చేసుకొనే ప్రయత్నంలో భాగంగా కవిత్వం కూడా ఆవిర్భవించింది. సమూహంలో భాగంగా మనిషి తన చుట్టూ ఉన్న సమాజంతో, ప్రకృతితో ఏకకాలంలో నెరపిన సంబంధం కవిత్వానికి దోహదం చేసింది. రూపంలోనూ, సారంలోనూ సామూహికతను ప్రతిబింబించే లక్షణాలు కవిత్వంలోకి వచ్చాయి. కవిత్వంలోని లయ, ధ్వని ఇంకా ఇతర రూపసంబంధ అంశాలు కవిత్వంలోని సామూహికతను తెలియజేస్తాయి. కవిత్వంలో ఉపయోగించే భాష కూడా సాధారణ వాడుకలో ఉండే భాష కాదు. కవిత్వ భాష ప్రత్యేకమైన భావావేశిత స్థితిలో 'ఉన్నతస్థాయి'కి చేరుకున్న రూపం. పైకి మార్మికతతో కనిపించే కవిత్వభాష రూపొందడం వెనుక సమాజంలోని శ్రమ విభజన, సంస్కృతి, సంప్రదాయాలు కారకాలుగా పనిచేస్తాయి. నృత్య, చిత్రలేఖనం వంటి ఆదిమ కళల మాదిరిగానే కవిత్వం కూడా తొలినాళ్ళలో భ్రమాత్మక వాస్తవికతను వెల్లడించేదే అయినప్పటికీ అది వెల్లడిచేసే ఆకాంక్షల రీత్యా అది వాస్తవికమైనది. రూపం, ద్వారానూ, సారం ద్వారానూ వెల్లడయ్యే సామూహికతే దాని వాస్తవికత.

సమాజం అభివృద్ధి చెంది వర్గాలు ఏర్పడినప్పుడు కవిత్వం కూడా ఆ ప్రభావానికి లోనయింది. వర్గ ప్రయోజనాల కనుగుణంగా కళలు, సాహిత్యం రూపొందడం మొదలయ్యాయి. సమాజం అనేక దశలుగా అభివృద్ధి చెందుతూ ఉండే కొలది కవిత్వం పాలకవర్గాల ప్రయోజనాలకు ప్రధాన పనిముట్టుగా మారింది.

అయితే కవిత్వం మనిషికీ, ప్రకృతికీ నడుమ ఉన్న వైరుధ్యం నుండి ఆవిర్భవించింది. కనుక ఎన్ని రకాల వర్గ సమాజాలు వచ్చినప్పటికీ దానిలోని సామూహిక లక్షణాలు మాత్రం కొన్నయినా కొనసాగుతూ వస్తున్నాయి. మనిషికీ ప్రకృతికీ నడుమ ఏర్పడిన ఈ వైరుధ్యం ప్రకృతిలో భాగంగా మనిషి చేసే సామూహిక కృషితోనే పరిష్కారమవుతుంది. ఈ వైరుధ్యం ప్రకృతిలో భాగంగా మనిషి చేసే సామూహిక కృషితోనే

పరిష్కారమవుతుంది. ఈ వైరుధ్యం పరిష్కారమయ్యేంత వరకూ కవిత్వమూ, కవిత్వంలోని సామూహిక స్వభావమూ కొనసాగుతూనే ఉంటాయి.

కవిత్వానికుండే మరో ప్రత్యేకత హేతువుకు లొంగకపోవడం. తనకర్థం కాని ప్రాకృతిక శక్తులతో మనిషి తీవ్ర భావావేశిత స్థితిలో చేసిన సంభాషణ వల్లా, సామూహిక శ్రమలో మనుషుల కదలికలో కనిపించే లయబద్ధత వల్లా కవిత్వానికి ఈ లక్షణం సంక్రమించింది. కవిత్వంలో కనిపించే ఉద్రిక్తపూరితమయిన ఈ అహేతుకత నాధారంగా చేసుకొనే భావవాదులు కవిత్వాన్ని ఒక అతీతమయిన శక్తిగా భావించారు. తీవ్ర భావావేశిత స్థితిని ఆధారంగా కవిత్వాన్ని బాహ్య వాస్తవికతకు దూరం చేసి దానినో దైవిక విషయంగా ప్రచారం చేశారు. అయితే కవిత్వంలో కనిపించే ఈ అహేతుకత వెనుక వుండే హేతువును మార్క్సిస్టు విమర్శకులు సామాజిక సంబంధాల వెలుగులో వివరించగలిగారు. అహేతువుకు, హేతువుకు నడుమ ఉన్న గతితార్కిక సంబంధాన్ని విప్పి చెప్పగలిగారు.

బాహ్య వాస్తవికత పట్ల శాస్త్రీయమైన అవగాహనతో నిమిత్తం లేకుండానే భావావేశిత స్థితిలో ప్రతిస్పందించడం, హేతువుకు లొంగకపోవడం అనే ప్రత్యేక లక్షణాలు సామాజిక చరిత్రలో కవిత్వానికి పుట్టుకతోనే సంక్రమించాయి. ఈ ప్రత్యేకతల కారణంగానే చరిత్ర గతిలో మిగిలిన సాహితీ ప్రక్రియలకన్నా కవిత్వం ముందుగా స్పందించగలుగుతోంది. సామాజిక వాస్తవికతను వెల్లడి చేయడంలో అడుగుజాడ కాగలుతోంది. ఇది ఒక ప్రక్రియగా కవిత్వానికున్న వెసులుబాటు అనుకుంటే, ఈ వెసులుబాటు ఆధారంగా కవిత్వం సాహిత్యచరిత్రలో రెండు పనులు నిర్వర్తిస్తూ వస్తున్నది. సామాజిక వాస్తవికతకనుగుణంగా వ్యక్తమయ్యే వివిధ ధోరణులు, ఉద్యమాలకు కవిత్వం మిగిలిన ప్రక్రియల కన్నా, ముందుగానే వాహిక కాగలగడం దీనిలో ఒకటి. దీనికి మరోవైపు కూడా ఉంది. సామాజిక వాస్తవికతను వెల్లడిచేసే వివిధ ధోరణులు తిరిగి ఆ వాస్తవికతతో ప్రతిస్పందించేటప్పుడు అనేక పరిమితులకు లోనుకావడం, ఉద్యమాలలో సంక్షోభాలు ఏర్పడడం వంటి సందర్భాలలో కూడా కవిత్వమే ముందుగా ఈ స్థితిని నమోదు చేయగలుగుతుంది. ఈ రెండింటిలో మొదటిది కవిత్వానికి గొప్ప ఆకర్షణనూ, పురోగామి స్వభావాన్ని కలగజేస్తూ ఉంటే, రెండవది స్తబ్ధతనూ, కొన్నిసార్లు గతంలోకి జారుకొనే స్వభావాన్నీ కలుగజేస్తోంది. ఈ రెండు విధులను కవిత్వం నిర్వర్తిస్తూ ఉండడం వల్ల సమకాలీన సామాజిక చరిత్రలో వివిధ ధోరణులను అధ్యయనం చేసేందుకు సమకాలీన కవిత్వం దోహదం చేస్తుంది.

ఒకవైపు విప్లవ సాహిత్యోద్యమం కొనసాగుతూ ఉండగానే 80, 90 దశకాలలో సామాజిక చలనంలో వచ్చిన వివిధ మార్పులు, స్త్రీవాద దళిత ముస్లిం మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వాలతో కూడిన అవగాహనను బౌద్ధిక, సృజనాత్మక రంగాలలోకి తీసుకొని వచ్చాయి. ఫలితంగా సాహిత్యమూ వివిధ బౌద్ధిక రంగాలూ మునుపటికన్నా ప్రజాస్వామికం అయ్యాయి. అయితే 90వ దశకం చివరినాటికి వీటి ఉరవడి బాగా తగ్గిపోయింది. 80, 90 దశకాలలో ఏ సామాజికచలనాల కారణంగా ఈ విధమైన ధోరణులు వచ్చాయో, తిరిగి

ఆయా సామాజిక చలనాలకున్న వస్తుగత పరిమితుల కారణంగా అవి అనేక పరిమితులకు గురయ్యాయి. 90లో దేశంలో అమలుపరచబడ్డ నూతన ఆర్థిక విధానాలు కూడా ఈ స్థితిని వేగవంతం చేయడానికి తమ వంతు పాత్ర వహించాయి. వీటిలో ఇప్పుడు ముస్లిం మైనారిటీ, ప్రాంతీయ అస్తిత్వాలు మాత్రమే ప్రభావశీల స్వభావంతో కొనసాగుతున్నాయి. హిందూ మతతత్వం, అభివృద్ధి విధానాలలోని అసమానతలను ఇవి ప్రశ్నిస్తున్నాయి.

80, 90 దశకాలలో బౌద్ధిక, సృజనాత్మక రంగాలలో బలమైన, విస్తృతమైన స్థానాలను ఆక్రమించిన స్త్రీవాద, దళితవాదాల వంటి ధోరణులలో ఏర్పడిన పరిమితులు మొత్తం సమాజం మీదనే పెద్ద ప్రభావాన్ని వేశాయి. అంతే కాకుండా ఆయా ధోరణులు పరిమితులకు గురవుతున్న కాలాన్ని పరిశీలించినా, సమాజంలోకి నూతనంగా చొచ్చుకొని వస్తున్న రాజకీయార్థిక విధానాల కారణంగా ఆ కాలానికి సామాజిక చరిత్రలో విభజనరేఖ వంటి ప్రాధాన్యత కనిపిస్తుంది. ఈ విభజన రేఖనాధారం చేసుకొనే సామాజిక శాస్త్రవేత్తలు అనేక సమకాలీన అంశాలను వివరించగలుగుతున్నారు.

సామాజిక వాస్తవికతను అర్థం చేసుకొని దానిని మార్చడానికి దోహదపడాల్సిన వివిధ ధోరణులు పరిమితులకు లోనుకావడం, మరోవైపు సామ్రాజ్యవాద అనుకూల ఆర్థిక విధానాల దాడి- మొత్తంగా 90వ దశకం చివరినాటికి అవగాహనలోను, వ్యక్తీకరణలోనూ అనేక సంక్లిష్టతలకు లోనయింది. వ్యవసాయరంగంలోనూ, ఇతర చేతివృత్తులలోనూ పెద్ద ఎత్తున సంక్షోభం మానవ హనన రూపంలో వెల్లడికావడం మొదలయింది. మానవ సంబంధాలు తీవ్రంగా విధ్వంసం కావడం మొదలయ్యాయి. ఈ సామాజిక సంక్షోభంలో బుద్ధిజీవులు, సృజనకారులలో మనిషిని ఏకాకిగా భావించుకునే నిరాశమయ, దు:ఖపూరిత, స్వీయహనన భావజాలంతో కూడిన వ్యక్తీకరణలు ముందుకు రావడం మొదలయింది. మరొకవైపు సమాజంతో నిమిత్తంలేని వ్యక్తి వాదనలు, కెరియరిజం తిరిగి బలాన్ని సంతరించుకొనేందుకు ప్రయత్నం చేయసాగాయి.

ఈ స్థితి కవిత్వంలో 90వ దశకం చివరినాటికే చోటు చేసుకుంది. దు:ఖాన్ని, నిరాశనీ ప్రేమిస్తూ దానిలోనే పడి కొట్టుకొనే విధ్వంసకర ధోరణిని విమర్శకులు, కవులు నిర్విమర్శగా ఆహ్వానించారు. ఈ ధోరణిని కొత్త వ్యక్తీకరణలుగా పిలుస్తూ మనిషి అస్తిత్వ వేదనకు సంబంధించిన కవిత్వంగా పైకెత్తారు. మనిషి అస్తిత్వాన్ని ఒంటరితనంలోను, శిథిలమయిపోతున్న జీవితం మధ్య, నిరాశతోనూ నిస్సత్తువుగా పలవరించడంలోనూ చూడగలగడం 60ల తర్వాత కవిత్వ పరిణామంలో గొప్ప వెనుకడుగుగానే చూడాలి. దీనిని కొందరు సామాజిక వాస్తవికత పట్ల నిరసనగా సమర్థింపజూస్తున్నారు. కానీ దీనికి అంత లోతు ఉన్నట్టు కనిపించదు.

ఇదే సమయంలో మరొకవైపు అనుభూతి ప్రధాన కవిత్వం వేలంవెర్రిలాగా వ్యాపించడం ఎక్కువయింది. అప్పటివరకు ఏ కొద్దిమందికో పరిమితమై ఉన్న ఈ కవిత్వం, 'శుద్ధమయిన కవిత్వం' పేరుతో విమర్శకులుగా పిలువబడుతున్న వారి మన్ననలను, ఆదరణను పొంది విస్తృతిలోకి వచ్చింది. విచిత్రమేమిటంటే అప్పటివరకూ కవిత్వంలో సాహిత్య ప్రయోజనం గురించి సిద్ధాంత వ్యాసాలు రాసిన ప్రముఖ విమర్శకులు

‘ఏదయినా సరే అది కవిత్వమై ఉంటే చాలు’ అనే ప్రాతిపదిక మీద ఈ కవిత్వాన్ని పైకెత్తారు. హైకూ వంటి కవితా నిర్మాణ పద్ధతి ప్రభావంతో ప్రముఖ కవులు ఉనికిలోకి తెచ్చిన చిన్న కవితా రూపాలు, విశేషంగా అనుకరణకు గురై తామరతంపరలా కవిత్వాన్ని పేజీలకొద్దీ నింపేందుకు కారణమయ్యాయి. ఏ రకమయిన స్పృహ లేకుండా కేవలం అనుకరణ దృష్టితో ఈ రకమయిన కవిత్వాన్ని రాస్తున్నవాళ్ళను పక్కనపెట్టినా కేవలం కవిత్వమయితే చాలు అనే అవగాహనతో ఈ కవిత్వాన్ని రాస్తున్నవాళ్ళను, వారి సమర్థకులను నిర్విమర్శగా, మౌనంగా అంగీకరించడం సమాజంలో నెలకొని ఉన్న ఒక రకమయిన స్తబ్ధతకు చిహ్నంగా భావించాలి.

ఛిద్రమవుతున్న కవిత్వంలో ఈ విచ్ఛిన్నకర ధోరణులకు మరొకవైపు పరిశీలిస్తే జీవితం గురించి గొప్ప ఆర్తితో, జీవితాన్ని పోరాడి గెలుచుకోవాలనే ఆకాంక్షతో వచ్చే కవిత్వం రాశిలోను, వాసిలోను తక్కువేమీ కాదు. అయితే దీనిలో కూడా అవాంఛనీయమైన పరిహరించుకోవలసిన ధోరణులు అనేకం ఉన్నాయి. వీటిలో ప్రధానమయింది గతానికి మళ్ళే వైఖరి. గతాన్ని కీర్తిస్తూ నోస్టాల్జియాలో మునిగిపోయే వైఖరి. సామ్రాజ్యవాద అనుకూల విధానాల కారణంగా గ్రామీణ సమాజంలో వస్తున్న విధ్వంసకర మార్పుల పట్ల కవుల స్పందన మిగిలిన అంశాల కంటే చాలా ఎక్కువగా ఉంది. వెనుకబడిన సమాజాల్లో సామ్రాజ్యవాద తాకిడికి గురి కావడానికి ఎక్కువ అవకాశమూ, విస్తృతి గ్రామీణ సమాజం, అక్కడి సంబంధాలకే ఉంటుంది కాబట్టి ఈ స్పందన వాంఛనీయమూ, సమర్థనీయమూ కూడా. కానీ ఈ సందర్భాలలో కవుల స్పందన గతమే ఘనమైంది అనే వైపుకు ప్రయాణించడం జాగ్రత్తగా గమనించాల్సిన అంశం. సామ్రాజ్యవాద వ్యతిరేకత సరైన తాత్విక అవగాహనను సంతరించుకోకపోవడం ఇక్కడి సమస్య.

సామ్రాజ్యవాద వ్యతిరేకత తాత్వికంగా సరైన రూపాన్ని సంతరించుకోకపోవడానికి సామ్రాజ్యవాదం పట్ల ఉన్న అవగాహనలోని లోపమే ప్రధాన కారణం. సామ్రాజ్యవాదం పట్ల రూపమాత్రమైన వ్యతిరేకతను మాత్రమే కలిగి ఉన్న ఆచరణ, సమాజంలో బలంగా కొనసాగుతూ ఉండడం వల్ల సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించవలసిన చోట దానికి బదులుగా గతాన్ని కీర్తించే వైఖరి ముందుకొస్తున్నది. ఈ ప్రమాదాన్ని నివారించడం కోసం సరియైన విమర్శను ఎప్పటికప్పుడు తీసుకొని రావలసిన అవసరం ఉంది.

దీనితోపాటుగా మానవ సంబంధాలలో వస్తున్న చలనశీలతను పట్టుకోవడంలో సృజనకారులలో సరయిన అవగాహన కొరవడడం కూడా కవిత్వంలో కన్పిస్తూ ఉన్నది. గత పదేళ్ళ కాలంలో మానవ సంబంధాలలో నిత్యమూ వస్తూ ఉన్న మార్పులను కేవలం ముడిగా తప్ప, వాటిని చలనశీలంగా పట్టుకోగలగడం- వాటికి గల భిన్న కోణాలను అవగాహన చేసుకోగలగడం, మొత్తం ఓ సమగ్రరూపంగా వ్యక్తీకరించగలగడం కవులలో బాగా కొరవడింది. ఈ కారణంగా సామ్రాజ్యవాదాన్ని వ్యతిరేకించే కవిత్వం రూపంలోను, వస్తువులోను మూసగా మారిపోయింది. అనేకమంది కవులు ఒకే కవితను రూపంలోనూ, సారంలోనూ ఏమాత్రమూ మార్పు లేకుండా రాస్తున్నారు. సాధారణంగా సాహిత్యంలో రూపం కంటే వస్తువు ఎక్కువ చలనశీలంగా ఉంటుంది. కానీ ఇప్పుడు

వస్తువులో కూడా పెద్ద మార్పులేవీ లేకపోవడం వల్ల రూపంలో ఏ మార్పులు లేకుండా అయిపోయి ఒకే కవిత మరలా మరలా పాఠకుల ముందు ప్రత్యక్షం అవుతోంది. ఈ సమస్యను తాత్వికంగా పరిష్కరించుకోవడమెట్లో తెలియని అనేకమంది కవులు 'మానవ సంబంధాల కవిత్వం' పేరుతో ఆత్మాశ్రయ కవిత్వం రాసుకొంటూ తమని తాము మోసం చేసుకొంటున్నారు. మానవ సంబంధాలను గురించి రాస్తున్నామనుకుంటూ తాత్వికంగా తమ బలహీనతను గడచిపోయిన స్మృతుల మాటున, బోలుబారిన మూస వ్యక్తీకరణల మాటున దాచుకునేందుకు వృథా ప్రయత్నం చేస్తున్నారు. ఏ సమస్యనైతే తప్పించుకొనేందుకు కవులు ఈ దారి ఎంచుకున్నారో తిరిగి ఈ దారి అదే మూసలోకి దారితీయడం ఇక్కడి విషాదం.

కవిత్వంలో నెలకొని ఉన్న ఈ సంక్లిష్టమయిన స్థితిని యధావిధిగా కొనసాగించడం అంటే ఉన్న స్థితిని మౌనంగా అంగీకరించడమే అవుతుంది. సమాజ చలనశీలతను దాని సమగ్ర రూపం నుండి కాకుండా ముడిగా, యాంత్రికంగా చూడడమే అవుతుంది. కవిత్వాన్ని సున్నితమయిన, లోతయిన, గాఢమయిన, తాత్విక వ్యక్తీకరణగా ప్రేమించే వారికి ఇది ఓ పరీక్షా సమయం.

# ప్రపంచీకరణ – కొత్త కోణాలు – కథాప్రక్రియ

- ఎన్ వేణుగోపాల్

కొత్త సహస్రాబ్దిలో మొదటి దశాబ్దం సగం గడిచిపోయింది. అంతకుముందరి దశాబ్దంలో తెలుగు సాహిత్య ప్రక్రియలన్నిటినీ విపరీతంగా ప్రభావితం చేసిన వస్తువు ప్రపంచీకరణ అని అందరికీ తెలుసు. కాగా, ఈ దశాబ్దంలో ఆ వస్తువు సాహిత్యం మీద ఎటువంటి ప్రభావాన్ని వేస్తోంది, అటు ఆ వస్తువులో గాని, ఇటు దాని ప్రభావంలో గాని ఏమైనా చెప్పుకోదగిన మార్పులు వచ్చాయా అని పరిశీలించడం సమాజ - సాహిత్య సంబంధాల అధ్యయనంలో ఒక ముఖ్యమైన, ఆసక్తికరమైన అంశం. ప్రపంచీకరణక్రమంలో ఏ కొత్త కోణాలు ఉనికిలోకి వచ్చాయి, వస్తున్నాయి, అవి మన కథా ప్రక్రియను ఏ పద్ధతిలో ప్రభావితం చేస్తున్నాయి, అందువల్ల తెలుగు సమాజానికీ సాహిత్యానికీ ఏ మేలు జరుగుతోంది, లేదా ఏ కొత్త కోణాలను మన కథా రచయితలు గుర్తించలేకపోతున్నారు, అందువల్ల తెలుగు సమాజానికిగానీ, సాహిత్యానికిగానీ జరుగుతున్న నష్టం ఏమిటి అని చర్చించడం ఇవాళ్టి ప్రసంగ (ఈ వ్యాస) లక్ష్యం.

ఈ దశాబ్దంలో కథా ప్రక్రియ, అంతకుముందరి దశాబ్దంలో ఉన్నంత ఆశావహంగా లేదని, ఎంపిక చేసుకోవడం ఒకప్పుడు ఉన్నంత సులువుగా ఉండడం లేదని, మంచికథలనుకున్నవాటి సంఖ్య తగ్గిపోతున్నదని కథ సిరీస్ సంపాదకులలో ఒకరయిన నవీన్ అంటున్నారు. మొత్తంగానే కథాప్రక్రియ గురించి అటు పాఠకులనుంచి, ఇటు రచయితల నుంచి కూడ కొంత అసంతృప్తి వినబడుతున్నది. పత్రికలలో అచ్చవుతున్న కథల సంఖ్య, విడిగా వెలువడుతున్న కథాసంపుటాల, సంకలనాల సంఖ్య చాల ఆశావహంగా ఉంటున్నదిగాని కథల నాణ్యత అంత సంతృప్తిని ఇస్తున్నట్టులేదు. ఈ అసంతృప్తికి ఎన్నో తెలిసిన, తెలియని, అన్వేషించవలసిన కారణాలు, సంక్లిష్ట కోణాలు ఉండవచ్చు గాని, ఇక్కడ మొత్తంగా సమాజంలోనూ, ప్రత్యేకించి తెలుగు రచయితలలోనూ ప్రపంచీకరణ విషయంలో కొనసాగుతున్న అస్పష్టత, గందరగోళం, అసమగ్ర, పైపై, మూస అవగాహనలు కారణం కావచ్చుననిపిస్తున్నది. అందువల్ల ఈ సమస్యను కొంత లోతుగా అధ్యయనం చేయవలసిఉంది.

ఈ దశాబ్దంలో కథ ఎలా ఉంది అని ప్రశ్నించుకోవడం, అసంతృప్తి పడడం ఇవాళ చాల మామూలయిపోయింది. అటువంటి అసంతృప్తులన్నిటినీ చూస్తే, ప్రధానంగా కనబడే అభిప్రాయాలలో కొన్ని – కథలు లోలోపలినుంచి కదిలించేట్టుగా ఉండడంలేదు, కొత్త కొత్త సామాజిక అనుభవాలు కథలలోకి రావడం లేదు, కథకులు మంచి వస్తువులు తీసుకున్నప్పుడుకూడ లోతయిన అధ్యయనం, పరిశీలన, వస్తువు మీద సమగ్ర అవగాహన లేకుండానే రాసేస్తున్నారు, మన కథారచయితలందరూ వయసు రీత్యా ముప్పైలలోనూ ఆపైనా ఉన్నవారేగాని, ఇరవైఐదులోపలి రచయితలే కనబడడంలేదు, 1990లలో ఒకవైపు కథాసాహితి పూనికతో వెలువడడం ప్రారంభించిన కథ సిరీస్ , దానితోపాటే కథాప్రక్రియలో వచ్చిన ఇతర పరిణామాలు, కొత్త గాలులు సాధించిన

విజయాలు కోల్పోతున్నామేమోనని అనిపిస్తోంది. ఇవేకాక మరికొన్ని విమర్శలు, అసంతృప్తులు కూడ ఉండవచ్చునుగాని, స్థూలంగా ఈ ప్రాతినిధ్య అసంతృప్తులను చూస్తే, అవి అన్ని రంగాలకూ — కథావస్తువుకూ, రూపానికీ, రచయితల శక్తికీ, రచయితల అవగాహనకూ, సామాజిక స్థితికీ – సంబంధించినట్టుగా కనబడుతున్నాయి.

బహుశా ఇంతగా అసంతృప్తి ఉండడానికి ఒక కారణం అంతకు ముందరి దశాబ్దంలో కథాప్రక్రియ సాధించిన విజయాలు, సాధించిన వస్తు విస్తృతి, వైవిధ్యం, లోతు కావచ్చు. ఈ దశాబ్దపు కథలను అంతకుముందరి దశాబ్దపు కథల ప్రాతిపదికమీద పోల్చిచూడడం జరుగుతుండవచ్చు. అందువల్ల ఇవాళ్టి అసంతృప్తి గురించి మాట్లాడుకోవాలంటే, మొదట, గత దశాబ్దంలో కథాప్రక్రియకు ఏమి జరిగిందో పరిశీలించాలి.

తెలుగుకథాప్రక్రియ 1990 దశకంలో ఒక కొత్త సందర్భాన్ని ఎదుర్కొంది. ఆ సందర్భం ప్రపంచీకరణ. ఆ సందర్భానికి తగినట్టుగా స్పందించడానికి తెలుగు కథ ప్రయత్నించింది. తెలుగు కథకులందరికీ ఆ ప్రపంచీకరణ క్రమం ఏమిటో, దానిలో ఇమిడిఉన్న అంశాలు, దాని పర్యవసానాలు ఏమిటో సంపూర్ణంగా తెలుసునని ఏమీ అనుకోనక్కరలేదు. కాని మన మార్కెట్లలోకి వస్తున్న కొత్త సరుకులు, మన డ్రాయింగ్ రూములలోని రంగులటీవీల ద్వారా మనకు అందుతూఉండిన, మనను ఆకర్షిస్తుండిన, సమ్మోహపరుస్తుండిన కొత్త జీవనశైలులు, కొత్త మానవసంబంధాలు మన కథారచయితలకు ప్రపంచీకరణ గురించి ఒక అవగాహన కలిగించాయి. తెలుగు కథకులు వెంటనే ఒక అసంకల్పితప్రతీకారచర్య లాగ, తక్షణ స్పందన లాగ ప్రపంచీకరణను వ్యతిరేకించారు, ప్రపంచీకరణ మానవసంబంధాలమీద ఎటువంటి దుష్ఫలితాలను వేయగలదో స్థూలంగానైనా గుర్తించి తమస్పందనలకు కథారూపాలు ఇచ్చారు.

ఆ స్పందన చాల సముచితమయినదీ, అవసరమయినదీ అనడంలో సందేహంలేదు గాని, ఇప్పుడు వెనక్కితిరిగి చూస్తే, ఆ స్పందన రోగసూచికలనే పట్టుకుందిగాని, లోపలికివెళ్ళి రోగపు అసలు కారణాలనుగాని, ఆ రోగపు పరిష్కారాలనుగాని గుర్తించినట్టు కనబడదు. అందువల్లనే ఆ దశాబ్దంలో ప్రపంచీకరణ ఇతివృత్తంతో వెలువడిన గొప్ప కథలలో చాల భాగం రోగసూచికలమీద కథలుగా మిగిలిపోయాయి. ఈ విశ్లేషణ ఆ కథల పాత్రను తక్కువ చేయడానికి కాదు. అవన్నీ కూడ నిజంగా గొప్ప కథలు. సాలభంజిక, ఖాదర్ లేడు, తెల్ల దయ్యం, రైతుల ఆత్మహత్యల కథలు, కార్మికుల జీవనోపాధి హరించడం మీద కథలు, వాటర్, పెండెం సోడా సెంటర్, వలసపక్షి, ఆఖరికి ఐదు నక్షత్రాలు, మురళీవాళ్లమ్మ, టైటానిక్, సూపర్ మామ్ సిండ్రోమ్, చివరి పిచ్చుక వంటి కథలన్నీ నిజంగా గొప్ప కథలే. జీవనానుభవాన్నీ, అవగాహననూ ఉన్నతీకరించే కథలే. కాని వాటిలో చాలభాగం రోగకారణం దగ్గరికి, మూలానికి వెళ్లలేకపోయాయని గుర్తించడం అవసరం.

నిజానికి ప్రపంచీకరణకు చెప్పలేనన్ని ముఖాలున్నాయి, సంక్లిష్ట కోణాలున్నాయి. అనేక రంగాలలో దాని ధాతువులు, పర్యవసానాలు ఉన్నాయి. గత పదిహేనుసంవత్సరాలుగా ప్రపంచవ్యాప్తంగానూ, దేశంలోనూ, తెలుగులోనూ వెలువడుతున్న ప్రపంచీకరణ అధ్యయనాలను చూస్తే ఈ విషయం అర్థమవుతుంది.

ప్రపంచీకరణకు రాజకీయార్థిక, సామాజిక, చారిత్రక, సాంస్కృతిక రంగాలన్నిటిలోనుంచీ చెప్పుకోగల అర్థాలెన్నో ఉన్నాయి. ఇవన్నీ ఒక సృజనాత్మక రచయిత తెలుసుకొని ఉండాలా, అవన్నీ రాస్తే అది కథ అవుతుందా అని ప్రశ్నిస్తే ఆ సైద్ధాంతికస్థాయి సంక్లిష్టతను ఉన్నదున్నట్టుగా రాస్తే అది కథ అవుతుందో కాదో కాని ఆ మూలాల అవగాహన కథా రచయితకు ఉండడం అవసరం అని నేననుకుంటాను.

తొలిదశాబ్దంలో ప్రపంచీకరణను ఇంత లోతుగా, తాత్వికస్థాయిలో అర్థంచేసుకోవడంలో మనం చేయవలసినంత కృషి చేయలేదేమోననిపిస్తుంది. బహుశా అందువల్లనే ఆ దశాబ్దంలో సాహిత్యప్రక్రియలన్నీ ప్రపంచీకరణపట్ల స్థూలంగా వ్యతిరేకవైఖరినే తీసుకున్నప్పటికీ, క్రమక్రమంగా ఆ వైఖరి మూసగా మారిపోయింది. ఆ తర్వాత వచ్చిన సాహిత్యరచనలన్నీ, ముఖ్యంగా కథలు పాత కథలకు అనుకరణలుగా కనిపించడం మొదలయింది. బహుశా ఇవాళ్టి అసంతృప్తికి ఒక కారణం అది కావచ్చు.

ఈ నేపథ్యంలో ఈ దశాబ్దపు అవసరం ఆ లోతులకు వెళ్లి, ప్రపంచీకరణను సమగ్రంగా, విశాల అర్థంలో గ్రహించడం. అలా గ్రహించినప్పుడు, మొదట ప్రపంచీకరణ క్రమపు తాత్విక, రాజకీయార్థిక, సాంస్కృతిక అర్థాలు ఏమిటో తెలుసుకోవాలి.

ఇదివరకు చాలసార్లు చెప్పినమాటే, ఇక్కడ కొందరయినా వినిఉన్న మాటే కాని, మరొకసారి చెప్పదలిచాను. కవి, రచయిత, బుద్ధిజీవి ఎవరయినా ఎందుకు ప్రపంచీకరణ గురించి తెలుసుకోవాలంటే, ఎందుకు ప్రపంచీకరణను వ్యతిరేకించాలంటే, ప్రపంచీకరణ అనేది తాత్వికంగానే మనిషికి వ్యతిరేకమయినదిగనుక. సాహిత్యకారులుగా మనకు మనిషే తొలి ప్రమేయం గనుక. ప్రపంచీకరణకు, దానికి మూలమయిన సామ్రాజ్యవాదానికి, పెట్టుబడిదారీవిధానానికి నిఘంటువులో మనిషి అనే మాట లేదు. ఆ నిఘంటువులో ఉన్నది అమ్మకందారు, కొనుగోలుదారు అనే మాటలు మాత్రమే. నువ్వు నీ రక్తాన్నీ చెమటనీ నాకు ఎంత చౌకగా, ఎంత ఎక్కువగా అమ్మగలవు, నీ నేలమీది వనరులను నాకు ఎంతగా అమ్మగలవు, నేను నీ నేలమీది వనరులతోనే తయారుచేసిన సరుకులను ఎంతఎక్కువగా కొనగలవు – పెట్టుబడిదారీ విధానానికి తెలిసింది ఇంతే. కాని మనకు, సాహిత్యకారులకు, సృజనకర్తలకు, బుద్ధిజీవులకు, ఆలోచనాపరులకు మనిషంటే రక్తమాంసాల మనిషి, ఉద్వేగాల మనిషి, ప్రకృతితో, సహ మానవులతో నిత్యం సంబంధాలలో ఉండే మనిషి. సాహిత్యమంతా ఈ మనిషిగురించే. మానవసంబంధాలగురించే. అందువల్ల, మౌలికంగానే తాత్వికస్థాయిలో సాహిత్యకారులకూ ప్రపంచీకరణకూ చుక్కెదురు. ఈ మౌలిక, స్వాభావిక వ్యతిరేకత అర్థమయితేగాని మన సాహిత్యరచనలలో ప్రపంచీకరణ వ్యతిరేకత లోతుగా, సమగ్రంగా ప్రతిఫలించదు.

ఇక ప్రపంచీకరణకు ఎన్నెన్ని వ్యక్తీకరణ రూపాలున్నప్పటికీ, దాని సుస్పష్టమైన ప్రయోజనం రాజకీయార్థిక రంగంలోనిదే. పెట్టుబడిదారీ విధానం పుట్టిననాటినుంచీ కూడ, దానికి మౌలిక లక్ష్యాలు తన ఉత్పత్తి యంత్రానికి చౌక ముడిసరుకులను ఇబ్బడిముబ్బడిగా, నిరంతరాయంగా సమకూర్చుకోవడం, ఆ ముడిసరుకులలో ప్రకృతి సహజమైన వ్యవసాయోత్పత్తులు, ఖనిజ వనరులు, మానవశ్రమ ఉండవచ్చు, అప్పటివరకూ సరుకులుగా గుర్తించబడని ఎన్నో వస్తువులు, సేవలు – మనిషికీ ప్రకృతికీ మధ్య ఉండేవి, మనిషికీ మనిషికీ మధ్య ఉండేవి – ఉండవచ్చు. ఈ సహజ సంబంధాలన్నిటినీ సరుకుల సంబంధాలుగా మార్చి, అన్ని సంబంధాలనూ, అన్ని వస్తువులనూ, అన్ని సేవలనూ మార్కెట్ తో అనుసంధానం చేయడం పెట్టుబడిదారీ విధాన లక్ష్యం. ఆ తర్వాత తన ఉత్పత్తి యంత్రం తయారుచేసే సరుకులను అమ్ముకోగలిగే మార్కెట్లను రూపొందించుకోవడం, వాటిని విస్తరించుకోవడం. ఈ లక్ష్యాలను మరో మాటల్లో చెప్పాలంటే సమాజంమొత్తాన్నీ మార్కెటీకరించడం దాని పరమధ్యేయం. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ ఈ ధ్యేయం అమలుచేసే వ్యూహానికి పరాకాష్ట. ప్రపంచీకరణలోని ఈ రాజకీయార్థిక సారాంశాన్ని ఎంతలోతుగా అర్థం చేసుకోగలిగితే, దాని విభిన్న వ్యక్తీకరణలను గుర్తించగలిగితే, మన కథారచయితలు ఎటువంటి ఇతివృత్తం తీసుకున్నా దానిలో ప్రపంచీకరణ ప్రభావాన్ని, పర్యవసానాలను కనిపెట్టగలరు, కథారూపం ఇవ్వగలరు.

ప్రపంచీకరణ క్రమం సంస్కృతిమీద ఎటువంటి ప్రభావం వేస్తున్నదో ఇప్పటికే చాల చర్చ జరిగింది, జరుగుతోంది. ఆ విషయం మళ్లీ ఇక్కడ ప్రస్తావించబోవడంలేదు. కాని, మన సంస్కృతి అనేదాని పట్ల ఒకవైపు హిందుత్వ, బ్రాహ్మణ్యం చేస్తున్న వాదనలు, ప్రపంచీకరణ వల్ల "మన సంస్కృతి" ధ్వంసమైపోతున్నదని సంఘపరివారం చేస్తున్న వాదనలు ఒకవైపు ఉండగా, మరోవైపు స్థానిక, పరంపరాగత శ్రమజీవన సంప్రదాయాన్ని రద్దుచేసి, సరుకుగా మార్చేందుకు ప్రపంచీకరణ శక్తులు చేస్తున్న ప్రయత్నాలు సాగుతున్నాయి. ఈ సంక్లిష్ట వాస్తవికతలో ప్రపంచీకరణ సాంస్కృతిక ప్రభావాల గురించి మన కథారచయితలు శ్రద్ధగా, నిశితంగా అధ్యయనం చేయవలసిఉంది.

ఈ సంక్లిష్ట అంశాలను గుర్తించడానికి, అర్థం చేసుకోవడానికి అవసరమయినంత దృక్పథ స్పష్టత లేకపోవడం మన రచయితలలో ఒక ముఖ్యమైన లోపమని అనిపిస్తుంది. మన సమాజంలో, సాహిత్యలోకంలో అనేకదృక్పథాల కలగూరగంప అభిప్రాయాలు, తాము ఒక దృక్పథానికి చెందినవారమని చెప్పుకుని తిరుగుతున్నప్పటికీ ఆ దృక్పథపు లోతుపాతుల గురించి అవగాహన లేకపోవడం సర్వసాధారణంగా జరుగుతోంది. ప్రగాఢమైన జీవితానుభవంతో, సన్నిహిత జీవనస్పర్శతో ఒకటో రెండో మంచికథలు రాయవచ్చును గాని, జీవితాన్ని సమగ్రంగా, సునిశితంగా అవగాహన చేసుకోగలిగిన దృక్పథ స్పష్టత లేకపోవడం వల్ల కొత్తకొత్త జీవనసందర్భాలను అర్థంచేసుకోవడం కష్టమవుతుంది. అందువల్ల వాటికి కథారూపం ఇవ్వడం కష్టమవుతుంది.

ఇవాళ్టి కథారచనలోని సమస్యలకు ఒక ప్రధాన కారణం ఈ దృక్పథస్పష్టత లేకపోవడమేననిపిస్తుంది. అందువల్లనే మన నిత్యజీవితానుభవంలోకి వస్తున్న అనేక కొత్త జీవనరంగాలు, వృత్తులు, జీవనశైలులు మనం అర్థం చేసుకోలేకపోతున్నం. ప్రపంచీకరణ ఫలితంగా, అందులో భాగంగా మనచుట్టూ జీవితం చాల మారిపోతున్నది. ఆ మారిపోతున్న జీవితాన్ని ఎంతోకొంత పత్రికా వార్తలు, ఇతర ప్రచార, ప్రసార మాధ్యమాలు మన దృష్టికి తెస్తున్నాయి. కాని ఆ ఉపరితల నివేదికలతోనే కథ, నవల వంటి వచనప్రక్రియలు రాయడం సాధ్యం కాదు. ఆ వార్తా నివేదికలకు రక్తమాంసాలు, మానవసంబంధాలు, ఉద్వేగాలు, సన్నివేశాలు, సంభాషణలు వంటివెన్నో చేర్చవలసిఉంటుంది.

ఒక్కసారి మనచుట్టూ ఉన్న జీవనరంగాలను, అసలు మన జీవితాలనే పరిశీలించిచూడండి. ఒక పది సంవత్సరాలకింది జీవితంతో పోల్చిచూడండి. ఎంత మార్పు కనబడుతోంది? ఆ మార్పు కింద ఎంత పాత కొనసాగింపే కనబడుతోంది? నిజానికి సాహిత్యం చేయవలసిన పని ఇట్లా మన జీవితానుభవంలోకి వచ్చి మనకు అప్రజ్ఞాతంగా ఉన్న విషయాలను మనకు విప్పిచెప్పగలగడం. కథకూ, ఇతరవచనప్రక్రియలకూ ఆ శక్తి ఉంది. మనకథారచయితలు ఆ శక్తిని గుర్తిస్తున్నారా, వాడుకుంటున్నారా?

ఇక్కడ ఇటీవలి రెండుకథలను గురించి ప్రస్తావించాలి. ఆ కథల్లో శిల్పపరమైన లోపాలో, ఇతర లోపాలో ఉండవచ్చును గాని ఆ రెండు కథలూ కూడ తెలుగు సమాజంలోకి కొత్తగా ప్రవేశిస్తున్న జీవన రంగాలగురించి, జీవనశైలులగురించి, మానవసంబంధాల పరిణామాలగురించి వెలుగు ప్రసరించడానికి ప్రయత్నించాయి. వాటిలో మొదటిది అక్కిరాజు భట్టిప్రోలు రాసిన గేటెడ్ కమ్యూనిటీ. తెలుగు సమాజంలోకి కొత్తగా గేటెడ్ కమ్యూనిటీ అనే బృందం వచ్చి చేరుతోంది. నిజానికి ఈ బృందం ప్రవేశించి పది సంవత్సరాలు గడుస్తున్నా, ఇంతకాలం అది మన సాహిత్యంలోకి రాకుండానే ఉండిపోయింది. ఎకనమిక్ అండ్ పొలిటికల్ వీక్లీ సంపాదకులు రామమనోహర్ రెడ్డి ‘టు ఇండియాస్ ‘ పేరుతో ఈ కొత్త పరిణామాన్ని విశ్లేషిస్తూ ఒక వ్యాసం రాశారు. భారత సమాజంలోపలనే, చుట్టూ ఉన్న సమాజానికి భిన్నమైన ఒక బృందం తమ నివాసాలచుట్టూ గోడలు కట్టుకుని, సమాజంనుంచి వేరయిపోయి, అంతర్జాతీయ సంపన్నులు అనుభవించే విలాసాలన్నీ అనుభవించాలని ఉవ్విళ్లూరుతూ బతుకుతోంది. ఇటువంటి గేటెడ్ కమ్యూనిటీలు హైదరాబాదుకు, ఇతర తెలుగు నగరాలకు విస్తరించి చాలకాలమే అయినా ఎందువల్లనో అది తెలుగు కథా వస్తువు కాలేకపోయింది. అలాగే, మానవ సంబంధాలలో, ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాలలో కాజువల్ వైఖరి ఎప్పటినుంచో ఉన్నదే, పురుషులు అనుభవిస్తున్నదే కాని, ప్రపంచీకరణ తర్వాత వచ్చిన ఎంతోకొంత వెసులుబాటువల్ల మధ్యతరగతి యువతి ఆ కాజువల్ వైఖరిని తాను అమలుచేయదలచుకుంటే ఏమవుతుంది? ఇది ఒక కొత్త జీవనశైలి. దీనిగురించి తాడికొండ శివకుమారశర్మ రాసిన పెళ్లంటే కథ వచ్చింది. ఈ రెండు కథలూ ప్రపంచీకరణ తర్వాత విస్తరిస్తున్న జీవితాన్ని, లేదా విచ్ఛిన్నమవుతున్న జీవితాన్ని పట్టుకోవడానికి చేసిన ఆహ్వానించదగిన ప్రయత్నాలని నేననుకుంటున్నాను.

ఇప్పటివరకూ తెలుగుకథ ప్రపంచీకరణ గురించి రాయడమంటే మానవసంబంధాల విచ్ఛిన్నాన్ని, ముఖ్యంగా చెదిరిపోతున్న గ్రామీణ జీవన సౌందర్యాన్ని రాయడమే నని, నోస్టాల్జియా – పురాస్మృతిని – రాయడమేనని ఒక అభిప్రాయంతో ఉంది. అది కొంతవరకు నిజమేగాని, అంతకుమించి రాయవలసిన విషయాలెన్నో ఉన్నాయని గుర్తించవలసి ఉంది. కొన్ని ఉదాహరణలు చెప్పకోవాలనుకుంటే, నేరం తీసుకోండి, ఒక మహా విషవలయంలా విస్తరిస్తున్న ప్రపంచీకరణ వలలను చూడండి. ప్రపంచీకరణలో భాగంగా పాలకవర్గాలు ప్రోత్సహిస్తున్న సమ్మతి తయారీ ని చూడండి. సంస్కృతులమధ్య ఘర్షణ పేరుతో అంతర్జాతీయంగా ముస్లిములమీద దాడి దగ్గరినుంచి అట్టడుగున అనాదృత, దళిత వర్గాలమీద దాడి దాకా సాగుతున్న బహిరంతర యుద్ధాలను చూడండి. వీటన్నిటికీ ప్రపంచీకరణకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని చూడండి. ఇవన్నీ కథా ప్రక్రియలోకి తప్పకుండా రావలసినవే.

మొదట నేరం సంగతి చూద్దాం. పదిసంవత్సరాలకిందికీ ఇప్పటికీ మన సమాజంలో నేరం పాత్ర ఎంత పెరిగిపోయిందో చూడండి. ఒకప్పుడు దినపత్రికల్లో నేరం వార్తలు జిల్లాల అనుబంధాల్లో పావుపేజీ, అరపేజీకి మించేవికావు. ఇప్పుడవి హైదరాబాదులోనైతే రెండుపేజీలకు దాటిపోతున్నాయి. అంతర్జాతీయంగా, ముఖ్యంగా లాటిన్ అమెరికన్ దేశాల్లోనూ, తూర్పు ఆసియా దేశాల్లోనూ ఎంతోమంది విశ్లేషకులు ప్రపంచీకరణకూ నేరం పెరుగుదలకూ ఉన్న ప్రత్యక్ష సంబంధంగురించి నిర్ధారించిఉన్నారు. ప్రపంచీకరణ క్రమం వల్ల విచ్చలవిడిగా పెరిగిన రియల్ ఎస్టేట్, మాఫియా, లంచగొండితనం, మాదకద్రవ్యాల వాడకం, జూదం, పాలనలో అరాచకం, మీడియా పేరుమీద స్వార్థప్రయోజనాల రక్షణ వంటి పరిణామాలన్నీ మానవ జీవితాన్ని అతలాకుతలంచేస్తున్నవే. తప్పనిసరిగా సాహిత్యరూపం పొందవలసినవే. గత పది సంవత్సరాలుగా రియల్ ఎస్టేట్ మన నగరాలలోనూ, పట్టణాలలోనూ జీవితాన్ని అల్లకల్లోలం చేస్తుంటే, ఒక్క కథ కూడ రాలేదంటే విచారించవలసిన విషయమే.

ఇక ప్రపంచీకరణకు ఒక అంతర్జాతీయ స్వభావం, అన్నిటినీ కప్పేసే వల స్వభావం, వాతాపిజీర్ణం అని అన్నిటినీ మింగేయగల స్వభావం ఉన్నాయి. ఇంతగా సంక్లిష్టత, పరస్పరాశ్రయత, పొరలుపొరలుగా సంబంధాలు ఉన్నచోట ఆ ఇతివృత్తాన్ని సృజనాత్మకప్రక్రియలోకి తీసుకురావడం చాల ఆసక్తికరంగా, సవాలులాగ ఉంటుంది. రాజకీయార్థశాస్త్రవిద్యార్థిగా నా అనుభవంలో ఉన్న ఒక విషయం చెపుతాను.

ఇది గ్లోబల్ కుగ్రామం, ఇది ప్రపంచ సంగ్రామం అన్నప్పుడు శ్రీ శ్రీది అతిశయోక్తి అనిపించవచ్చు. గంగవరంలో చిందిన మత్స్యకారులనెత్తురుకూ, అమెరికన్ సామ్రాజ్యవాదానికీ సంబంధం ఉన్నదని నేనంటే బట్టతలకూ మోకాలుకూ ముడిపెట్టినట్టుందని అనిపించవచ్చు. కాని, అమెరికన్ సామ్రాజ్యవాదం, అమెరికన్ ఆర్థిక వ్యవస్థ, అమెరికన్ సైనిక- పారిశ్రామిక యంత్రాంగం తమ జలాంతర్గాముల నిర్మాణానికీ, బాంబర్ల, జెట్ ఫైటర్ల, క్షిపణి వ్యవస్థల నిర్మాణానికీ ఆధారపడే లోహాలలో ప్రధానమైనది అల్యూమినియం. ఆ అల్యూమినియం తయారు కావాలంటే బాక్సైట్ అనే ఖనిజం కావాలి. ప్రపంచంలో దొరికే బాక్సైట్ ఖనిజం మొత్తంలో తొంబై శాతం వాడుకునే

అమెరికా లో బాక్సైట్ ఖనిజం లేదు. ఆ ఖనిజాన్ని తవ్వితీసే దేశాలన్నిటినీ తన గుప్పెట్లో పెట్టుకునిఉండడం అమెరికా కు అత్యవసరం. ఆ బాక్సైట్ మన విశాఖపట్నం, తూర్పు గోదావరి జిల్లాల సరిహద్దు అడవి కింద ఉందిగాని, అక్కడ తవ్వకాలు జరపడానికి వన్ ఆఫ్ సెవెంటీ చట్టం అడ్డం వస్తుంది. ఆదివాసుల జీవనసరళి అడ్డంవస్తుంది. అక్కడినుంచి బాక్సైట్ తవ్వే పనిని సామ్రాజ్యవాదుల దళారీ సంస్థ జిందాల్ కంపనీ కి అప్పగించి, దాన్ని రవాణా చేయడానికి ప్రత్యేకంగా గంగవరం ఓడరేవు నిర్మించాలి. అక్కడ తరతరాలుగా జీవిస్తున్న మత్స్యకారులు అడ్డం వస్తే వారిమీద కాల్పులు జరిపి, నెత్తురు పారించి అయినా సరే, బాక్సైట్ తరలింపుకు మార్గం సుగమం చేయాలి. అమెరికాలో తయారయిన జలాంతర్గామి మీద గంగవరంలో పోలీసుకాల్పులకు బలిఅయిపోయిన నూకరాజు నెత్తురు అంటి ఉందనే దృశ్యం ఒక వచనరచయితకు ఎంత అవకాశం ఇవ్వగల ఇతివృత్తం?

రోడ్ల వెడల్పు కార్యక్రమం మన రాష్ట్రంలో ప్రారంభమై, అన్నిచోట్లా, రహదారులపక్కన చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుని బతుకు వెళ్లదీస్తున్న అభాగ్యుల జీవితాలలో భూకంపం సృష్టించినప్పుడు ఖాదర్ లేడు వంటి ఆర్ద్రమైన కథలతో తెలుగు కథ స్పందించింది. కాని ఒక దశాబ్దం గడవకుండానే, ఇవాళ మన పాలకవర్గాలు, ప్రపంచీకరణశక్తులు ఎంత విజయం సాధించాయంటే, రోడ్ల వెడల్పు కార్యక్రమానికి సమ్మతి తయారీ మొదలయిపోయింది. ఇవాళ అనేకానేక ఆకర్షణీయమైన పథకాలలో విపరీతంగా వాహనాలు కొనుక్కున్న మధ్యతరగతి (ఆ వాహనాల అమ్మకాల వెనుక ఉన్న చమురు పరిశ్రమ, వాహన పరిశ్రమ ప్రయోజనాలు, వాటికోసం దేశవ్యాప్తంగా వేలకోట్ల రూపాయలతో నిర్మాణమవుతున్న రోడ్లు – అదంతా మరో కథ) ఇవాళ రోడ్డు మీదికి రాగానే రద్దీని చూసి విసుక్కుని రోడ్ల వెడల్పు కార్యక్రమం ఎంత మంచిదో నని కితాబులు ఇస్తున్నారు. ఇంకా రోడ్లు వెడల్పు అయితే బాగుండునంటున్నారు. ఈ మానసికస్థితిలో మార్పు మన కథలకు ఇతివృత్తంకాదా? ఆ మార్పుకు మూలమైన సమ్మతి తయారీ, ఆ మార్పుతో లాభపడే బహుళజాతి సంస్థల కుట్రలు మన కథలకు ఇతివృత్తాలు కావా?

ఇక చివరిగా, చమురుసేలలమీద జీవితాలు గడుపుతున్న ముస్లిములమీద దాడి చేయడానికి సంస్కృతులమధ్య ఘర్షణ అని అమెరికన్ సామ్రాజ్యవాదం, బహుళజాతి సంస్థలు ఒక సిద్ధాంతాన్ని తయారు చేసుకున్నాయి. ఆ సిద్ధాంతం అంతర్జాతీయస్థాయిలో మాత్రమే కాదు, అన్నిచోట్లా అమలులో ఉంది. అన్నిచోట్లా, ఏయే వర్గాలు, సమూహాలు తరతరాలుగా చేతివృత్తులకూ, వ్యవసాయానికీ, స్వతంత్ర వైద్యానికీ, సహస్రవృత్తుల శ్రమలకూ ఆలవాలమో ఆయా వర్గాలనూ సమూహాలనూ అణచివేయడానికీ, పక్కకు తోసేయడానికీ, వారి నైపుణ్యాలకు విలువలేకుండా చేయడానికీ సామ్రాజ్యవాదం, బహుళజాతిసంస్థలు ప్రయత్నిస్తున్నాయి. వారిలో చాల ఎక్కువమంది ఇంకా మార్కెటేతర సంబంధాలలో ఉన్నారు గనుక, వారిని పక్కకు తోసేయడమే ఏకైక మార్గంగా సామ్రాజ్యవాదం భావిస్తోంది. ఇవాళ రెండో దశ సంస్కరణలు అనీ, గ్రామీణ మార్కెట్లలోకి ప్రవేశం అనీ, మైక్రోఫైనాన్స్ అనీ, చేతివృత్తుల ఆధునికీకరణ అనీ వినబడుతున్న నినాదాల అసలు సారం ఇదే. ఇది ప్రపంచీకరణ కొత్త ముఖాలలో ఒకటి. ఈ ఘర్షణలో నష్టపోయే వారు ముస్లింలు, ఆదివాసులు, స్త్రీలు, దళితులు,

వృత్తికులాలవారు – ఒక్క మాటలో చెప్పాలంటే, మన సమాజంలోని అత్యధిక సంఖ్యాకులు. వారి జీవితాల్ని అల్లకల్లోలంచేయబోతున్న ఈ ప్రపంచీకరణముఖం గురించి రాయడంకన్న మన సాహిత్యం సాధించగలిగిన ప్రయోజనం మరేమన్నా ఉన్నదా?

ప్రపంచీకరణ అనివార్యమని, దాన్ని ఆపలేమని, కేవలం దానికి మానవీయ ముఖం కలపడం తప్ప మరొక దారి లేదని చాలమంది మేధావులు భావిస్తున్నారు, ప్రకటిస్తున్నారు. కాని ప్రపంచీకరణను అడ్డుకోవడం పరిమిత అర్థంలోనైనా సాధ్యమేనని లాటిన్ అమెరికన్ ప్రజా ఉద్యమాలు అనుభవాలు చూపుతున్నాయి. ప్రపంచీకరణను అంతిమంగా అడ్డుకోవడం, రద్దుచేయడం ఒక రాజకీయ చర్య అని, రాజకీయార్థిక క్రమం అని అందరికీ తెలుసు. ఆ చర్యలనూ, క్రమాలనూ బలపరచడం రచయితల బాధ్యత. ఒకవేళ ఆ రాజకీయకార్యక్రమంలో భాగం పంచుకోదలచుకోకపోయినా, ప్రపంచీకరణ్ ప్రోత్సహించదలచిన మార్కెటీకరణ క్రమానికి వ్యతిరేకంగా, మనసమాజంలో ఉన్న మార్కెటేతర సంబంధాలను ఎత్తిపట్టే పని చేయవచ్చు. అంటే ఒక ప్రత్యామ్నాయ సంస్కృతికి మనం సాహిత్య వ్యక్తీకరణ ఇవ్వవచ్చు.

ఈ పని చేయకుండా మనను అడ్డుకుంటున్నవి ఏమిటి? ఎందువల్ల మన బుద్ధిజీవులు, కథారచయితలు ఈ కొత్త కోణాలవైపు తమ దృష్టి సారించడంలేదు?

ఇందుకు కారణాలు మన సమాజంలోనూ, మన సాహిత్య సంప్రదాయాలలోనూ, మన బుద్ధిజీవులు రూపొందే పద్ధతిలోనూ ఉన్నాయనుకుంటాను. మన సమాజంలో కొంత సాధించగానే ఆగిపోయే తత్వం ఎక్కువ. జ్ఞానం అపారమనీ, ఎంత నేర్చుకున్నా ఇంకా నేర్చుకోవలసింది ఉంటుందనీ మనకు తెలుసు గాని, దాన్ని అమలులోకి తేవడానికి మనలో మధ్యతరగతికి సహజమైన బద్ధకం, నిర్లిప్తత, అలక్ష్యం వంటి ఆటంకాలెన్నో ఉన్నాయి. మన సమాజంలోనే, మన సాహిత్య సంప్రదాయంలోనే అసమగ్రతను ఆమోదించే, చూసీ చూడనట్టుపోయే గుణం ఏదో ఉన్నట్టుంది. నిజానికి ఎంత జ్ఞానికైనా, ఎంతటి అనుభవజ్ఞుడికైనా అసమగ్రత ఉంటుంది. ఆ అసమగ్రతను ఎవరైనా అధ్యయనం ద్వారా, పరిశీలనద్వారా తగ్గించుకోగలరు. సమగ్రత వైపు ప్రయాణించగలరు. మరొక సందర్భంలో, తత్వశాస్త్ర చర్చలో భాగంగా లెనిన్ అన్నట్టు, పరమసత్యం అనేదేమీ లేదు, ఏ ఒక్కరూ పరమ సత్యాన్ని చేరుకోలేరు, ప్రతిఒక్కరూ చేసేది ఆ పరమసత్యంవైపు ప్రయాణం మాత్రమే. ఆలోచనాపరులందరూ చేసే అధ్యయనం ద్వారా, జీవిత పరిశీలనద్వారా చేసే ఆ ప్రయాణానికి అదనంగా ఒక కథారచయిత వస్తువైవిధ్యం కొరకు, కొత్త శిల్ప పద్ధతుల కొరకు అన్వేషణ సాగించవలసి ఉంటుంది. కొత్త ప్రయోగాలు చేయవలసిఉంటుంది. ఇదంతా కథారచయితలమీద మోయలేని బరువులు మోపడంకాదు. కథారచయితలు పండితులుగా మారిపోవాలని సూచించడం కాదు. మనకాలపు కథారచయితలముందర కాలం ప్రపంచీకరణ అనే ఒక సవాలును పెట్టింది. ఆ సవాలును అర్థంచేసుకుని, ఇతరులకు అర్థంచేయించే కథలు అల్లి, సామాజిక జీవితాన్ని ఉన్నతీకరించగల ఒక అద్భుతమైన అవకాశం ఇది. చరిత్ర తెలుగు సాహిత్యకారులముందు ఎన్నోసార్లు అటువంటి అవకాశాల్ని పెట్టింది. గతకాలపు సాహిత్యకారులందరూ ఆ

అవకాశాల్ని వాడుకుని తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నంచేశారు. తెలుగు జీవితాన్ని ఉన్నతీకరించారు. తమ రచనలకూ తమకూ సుస్థిర స్థానం సంపాదించుకున్నారు. ఇవాళ్టి కథారచయితలు కూడ అటువంటి కృషి చేస్తారనడంలో సందేహంలేదు.

(వాసిరెడ్డి నవీన్ , పాపినేని శివశంకర్ ల సంపాదకత్వంలో 'కథాసాహితి' ప్రచురణగా పదహారు సంవత్సరాలుగా క్రమం తప్పకుండా వెలువడుతున్న కథాసంకలనాల సిరీస్ లో తాజా సంకలనం కథ 2005 ఆవిష్కరణ సభలో కర్నూలులో సెప్టెంబర్ 10, 2006 న చేసిన ప్రసంగం ఈ వ్యాసానికి తొలిరూపం)

## ‘కనిపించే పదం’ - కల్పన రెంటాల తో ముఖాముఖి - హిమబిందు

ఇంటర్వ్యూ:

తనను ‘కనిపించే పదం’గా ప్రకటించుకున్న కల్పన రెంటాల, నిజానికి ‘వినిపించే బలమైన స్వరం’ కూడా. అచ్చం ఆమె కవితలలాగే... ఆమె మాట, భావాలు, వాటిని ప్రకటించే తీరు చాలా ‘ఇంటెన్సివ్’గా...నిలదీయటాకి ఏ మాత్రం భయపడని విధంగా వుంటాయి. అజంతా అవార్డు గ్రహీత అయిన కల్పన, స్త్రీ వాద కథ, సాహిత్య విమర్శలే కాకుండా పలు అంశాలపై విశ్లేషణాత్మక వ్యాసాలు రాసి, ఇప్పుడున్న కొద్ది మంది సాహిత్య విమర్శకులలో ఒకరిగా మంచి గుర్తింపు పొందారు. ఇండియా- పాకిస్తాన్ కవయిత్రుల కవితల్ని ‘ఆమె పాట’ కాలమ్ కింద అనువాదం చేశారు. స్త్రీల స్వరాలు ఏ స్థాయిలో ఉన్నా ఆలకించాలని, గొంతు దాటి రాని ఆలాపనలను సైతం పసిగట్టి వినిపించాలని తపన పడే ఆమెతో చిన్న సంభాషణ...

ప్ర :- సాహిత్యంపై మీ ఆసక్తి ఎలా మొదలయ్యింది. ముఖ్యంగా స్త్రీవాద సాహిత్య ప్రభావం గురించి చెప్పండి.?

జ :- చిన్నప్పటి నుంచీ మా ఇంట్లో ఉండి ఉన్న సాహిత్య వాతావరణం వల్ల నాకు సాహిత్యం పట్ల ఆసక్తి, అనురక్తి ఏర్పడ్డాయి. మా నాన్నగారు రెంటాల గోపాలకృష్ణ స్వయంగా కవి, నాటక రచయిత, అనువాదకుడు, జర్నలిస్టు. మా పెద్దన్నయ్య సత్యనారాయణ కలం పేరు జూనియర్ రెంటాల. ఆయన కూడా కవి, శేషేంద్ర వీరాభిమాని. మా నాన్నగారు రామాయణ, మహాభారత ఇతిహాసాలను ఎంతగా ప్రేమించేవారో, రష్యన్, యూరోపియన్ ఆంగ్ల సాహిత్యాలను అంతగా ఆదరించేవారు. మా నాన్నగారి ఈ సుగుణం మా ఇంట్లో పిల్లలందరి మీదా ప్రభావం చూపింది. మా నాన్నగారికి ఇంట్లో సొంత లైబ్రరీ ఉండేది. ఆయనే దానికి లైబ్రేరియన్. తెలుగు చదవటం, రాయటం వచ్చేటప్పటికి మాకు ఏడెనిమిదేళ్లు ఉండేవేమో. ముందు మా అందరి చేత వచన రామాయణ, మహాభారత, భాగవతాలను చదివింప చేసేవారు. ఆ తరువాత యుద్ధ సాహిత్యాన్ని చదివించారు. అటు సాహిత్యం గురించే కాకుండా, తన జర్నలిజం వృత్తి గురించి, బయట సమాజంలో తీవ్రంగా జరుగుతున్న ఉద్యమాల గురించి కూడా కథలు కథలుగా చెప్పేవారు. నా చిన్నప్పుడు జై ఆంధ్రా మూవ్‌మెంట్ ఎంత ఉధృతికి వెళ్లిందో, అప్పుడు జరుగుతున్న గొడవల గురించి ఓ జర్నలిస్టుగా మాకు అర్ధమయ్యే రీతిలో చెప్పేందుకు ప్రయత్నించేవారు. అయితే మా పెద్దన్నయ్య శేషేంద్ర వారిదే అసలు సిసలైన కవిత్వ బాట అనేవాడు. తన కిష్టమైన తిలక్, క్రిష్ణశాస్త్రి కవిత్వాల గురించి మాకు చెప్పేవాడు. నయాగరా కవులు, నాన్నగారికి ఆప్తమిత్రులు అయిన ఏల్చూరి సుబ్రహ్మణ్యం, అనిశెట్టి సుబ్బారావు, కుందుర్తి, గంగినేని వెంకటేశ్వరరావు లాంటి వాళ్లు మా ఇంటి రావడం, వాళ్లందరి సాహిత్య చర్చలు మా ఇంట్లో నా చిన్ననాటి వాతావరణం.

ఈ వాతావరణమే నన్ను కూడా జర్నలిస్టు, కవయిత్రి, రచయిత్రి చేసింది. అయితే ఇక్కడ మీకో మాట చెప్పాలి. స్త్రీవాద సాహిత్య ప్రభావం గురించి అడిగారు మీరు, జర్నలిజంలో నా కెరీర్ ఇరవై ఏళ్లకే మొదలయ్యింది. నా డిగ్రీ పూర్తయిన వెంటనే 1986లో, అప్పట్లో నంబర్ వన్ వారపత్రికగా ఉన్న ఆంధ్రజ్యోతి వీక్లీలో అప్పుడు వొస్తున్న టీ.వి ప్రోగ్రాములపై 'టీ.వి సమీక్ష' పేరుతో ప్రతి వారం కాలమ్ నిర్వహించమని అడిగారు ఎడిటర్ పురాణం సుబ్రహ్మణ్య శర్మ. దాదాపు మూడేళ్ల పాటు ఈ కాలమ్ నిరాటంకంగా సాగి, పాఠకుల మన్ననలను పొందింది. అప్పట్లోనే స్వాతి వీక్లీకి, మంత్లీకి కూడా ఇంటర్వ్యూలు, ట్రాన్స్‌లేషన్లు చేసేదాన్ని. తరువాత ఓ రెండేళ్లకే ఆల్ ఇండియా రేడియో విజయవాడ కేంద్రంలో క్యాజువల్ న్యూస్ రీడర్‌గా జాయిన్ అయ్యాను. 1989లో ఆంధ్రభూమి విజయవాడ ఎడిషన్‌లో సబ్ ఎడిటర్‌గా ఫుల్ టైమ్ ఉద్యోగం ప్రారంభించాను. అప్పటి వరకు నాకు తెలిసిన ప్రపంచం వేరు. ఇల్లు, పుస్తకాలు, కాలేజీ, చదువు.

కానీ ఎప్పుడైతే బయటకి వొచ్చి ఈ ఉద్యోగాలు చెయ్యడం మొదలుపెట్టానో, నాకు అప్పటి వరకు తెలియని ఒక సరికొత్త ప్రపంచం కనిపించింది. అదే సమయంలో తీవ్ర ఉధృతితో స్త్రీ వాద సాహిత్యం ముందుకు వొచ్చింది. కమలాదాస్ 'మై స్టోరీ', ఓల్గా 'మూడు తరాలు' ఇవన్నీ చర్చకు గురయ్యాయి. 'నీలిమేఘాలు' సంకలనం ఆవిష్కరణ సభ విజయవాడలో జరిగే నాటికి నేను కవితలు రాసినా, సాహిత్య మిత్రులైనటువంటి ఇంద్రగంటి శ్రీకాంత్ శర్మ, ఘంటసాల నిర్మల లాంటి వాళ్లకు తప్ప, ఓ రకమైన బెరుకుతో ఎవరికీ చూపించేదాన్ని కాదు. 95 వరకు నేను రాసుకున్నవి నా వ్యక్తిగత కవితలే.

95లో మా నాన్నగారి మరణంతో రాసినదే అచ్చయిన నా మొదటి కవిత. ఆ తరువాత కవిత్వం నాకొక ఓదార్పయింది. విజయవాడలో, అప్పట్లో మా ఫ్రెండ్స్... రచయిత్రులు, కవయిత్రులు అయిన సి. సుజాత, పి. సత్యవతి, ఘంటసాల నిర్మల, స్వాతి, ఇంద్రగంటి జానకీ బాల, డి. సుజాతా దేవి, ఆహ్వానం లక్ష్మి మొదలైన వాళ్లంతా కలిసి 'చేతన' అనే సంస్థను ఏర్పాటు చేసుకున్నాం. అందులో భాగంగా సాహిత్య చర్చలతో పాటు, సామాజిక అంశాలపై కూడా దృష్టి సారించాం. ఇవన్నీ కూడా నేను రచయితని కావటాకి దోహదం చేశాయి.

ప్ర :- ఇంత వరకు మీరు రాసిన కవితలు లేదా కథల వెనుక బలమైన స్ఫూర్తి ఏదైనా ఉందా? మీ శైలి స్వభావాన్ని తెలియచేస్తారా?

జ :- 94-95 సంవత్సరాలలో, నా వ్యక్తిగత జీవితంలోని తీవ్ర సంఘర్షణకు కవిత్వం నాకొక అవుట్‌లెట్ అయింది. నా కవిత్వం అంతా ఒక తీవ్ర భావావేశం నుంచి పుట్టుకొచ్చిందే. నన్ను బాధపెట్టిన సంఘటనలు, నేను స్పందించిన సందర్భాలు అన్నీ కవితల రూపంలో బయటకు వొచ్చాయి. అవి మా నాన్న మరణం కావచ్చు, గుజరాత్ భూకంపం కావచ్చు, ఆఫ్ఘనిస్తాన్‌లో బుద్ధుడి విగ్రహం ధ్వంసం కావచ్చు. చుట్టూ ఉన్న సమాజంలో స్త్రీల పట్ల జరుగుతున్న అత్యాచారాలు, అన్యాయాలు, వారి వేదనలు నా వేదనగా మారింది. వారి దుఃఖం నా కన్నీరైంది. అదొక దుఃఖ లిపి. నా కవితలలో బానిస స్త్రీలందరూ కలిసి నేనుగా మారాను. అందుకే నా పుస్తకాకి

'నేను కనిపించే పదం' అనే శీర్షిక పెట్టాను. ఆ నేను కేవలం నేను కాదు. అన్యాయాలకు, అణచివేతకు గురయ్యే ఏ స్త్రీ అయినా కావచ్చు.

ఇక కథల విషయానికి వొస్తే, నేను రాసింది చాలా తక్కువ. ఓ ఆరేడు కథల దాకా ఉంటాయి. అందులో సగం కథలు అమెరికా వొచ్చాక రాసినవే. అక్కడి జీవిత విధానానికి సంబంధించి నా పరిధిలో నేను చర్చించాను. ఒక్కో సారి కవిత్వంలో సరిగా చెప్పలేదన్న అసంతృప్తి వెన్నాడుతుంది. మనం చర్చించాలనుకున్న విషయాలు కథలో బాగా ఒదుగుతాయి అనిపిస్తుంది. నేను కథల వైపు మళ్లటానికి అదే కారణం. అయితే కవిత్వం పూర్తిగా భావావేశ ప్రక్రియ. కథ ఆలోచనాత్మకమైనది. మనం చెప్పాలనుకున్న విషయం గురించి లోతుగా ఆలోచించి, అధ్యయనం చేయగలిగినప్పడే మంచి కథ రూపుదిద్దుకుంటుంది. మంచి కథల్ని చదివి ఆనందించడం వేరు, రాయడం వేరు. మంచి కథ అంటే ఇలా ఉండాలని చెప్పడం వేరు, రాసి చూపించడం వేరు. నేనింకా కథా ప్రక్రియలో ఆరంభ దశలోనే ఉన్నానని అనుకుంటున్నాను.

ప్ర :- ఇటీవలి కాలంలో, స్త్రీవాద సాహిత్యాకి సంబంధించి కొంత వరకు స్థబ్దత చోటుచేసుకుందనే విమర్శ ఉంది. కొత్త ఆలోచనలు కరవవుతుండటమా…?మునుపటి ఉత్సాహం తగ్గిందా…?

జ :- స్త్రీ వాద సాహిత్యంలో స్థబ్దత అనేది నా అభిప్రాయం ప్రకారం రాంగ్ స్టేట్మెంట్. మొదట్లో స్త్రీవాదం ఓ ఉధృతిగా వొచ్చింది. ఓ వేగంతో ముందుకొచ్చింది. తరువాత ఆ ఉధృతి స్థానంలో ఆలోచన చోటు చేసుకుంది. నిజానికి స్త్రీవాద సాహిత్యంలో తొలి దశలో ఎక్కువగా వొచ్చింది కవిత్వమే. ఆ తరువాత దశలో కథలు, విమర్శ వొచ్చాయి. నేనింతకు ముందే చెప్పినట్టు, సాధారణంగా కవిత్వం ఎవరికైనా ఓ భావావేశమే. కథలో ఆవేశం పనికి రాదు. ఆలోచనాత్మకంగా సాగాలి. ఇప్పుడు స్త్రీవాద కవిత్వం రావడం లేదా అంటే వొస్తోంది. కావీ మొదట్లో వొచ్చిన స్త్రీవాద కవిత్వం ప్రధానంగా స్త్రీల శరీరాలకు సంబంధించినదయితే, తరువాత వొచ్చిన స్త్రీవాద కవిత్వం చుట్టూ ఉన్న సమాజాకి సంబంధించింది. ముఖ్యంగా గ్లోబలైజేషన్ స్త్రీల మీద, స్త్రీల జీవితాల మీద చూపిస్తున్న ప్రభావం గురించి మలితరం స్త్రీ వాదులు కథ, కవితల ద్వారా చర్చించారు. అంతర్జాతీయంగా చర్చకు వొస్తున్న యుద్ధం, పర్యావరణం మొదలైన వాటిపై స్త్రీవాదులు బలంగా రాస్తున్నారు. గ్లోబలైజేషన్ గురించి మాట్లాడడంతో పాటు, ప్రాంతీయ దృక్పథంతో రాయటం కూడా అంతే ముఖ్యమని స్త్రీలు గుర్తించారు. దీనికి ఉదాహరణ ఇటీవలి కాలంలో తెలంగాణా రాయలసీమ నుండి కథా రచయిత్రులు ఎక్కువ కావడం. ఇది స్త్రీవాదంలో పరిణతి సాధించిన దశగా చెప్పకోవచ్చు. స్త్రీవాద నవలలు, సాహిత్య విమర్శలు ఇంకా రావాలి. అవి వొస్తే ఇప్పడున్న దశకు ఓ సాధికారత వొస్తుంది. మొదట వొచ్చిన స్త్రీవాద సాహిత్యం గురించి మాట్లాడిన విమర్శకులు, మలితరం సాహిత్యం గురించి పెద్దగా చర్చించలేదు. స్త్రీవాద సాహిత్య విమర్శ జరగాల్సిన స్థాయిలో జరగకపోవడం వల్ల, స్త్రీవాద సాహిత్యంలో స్థబ్దత ఏర్పడిందని, స్త్రీవాదుల్లో కొత్త ఆలోచనలు, కొత్త చూపు కరవవయ్యాయనే కామెంట్స్ వినిపిస్తున్నాయి. చాపకింద నీరులా ముంచుకొస్తున్న గ్లోబలైజేషన్ గురించి ఇవాళ ఎవరైనా,

ముఖ్యంగా స్త్రీవాదులు మాట్లాడటం ఓ అనివార్య సందర్భం అయింది. ఈ సందర్భాన్ని ఫెమినిస్టు రైటర్స్ సరిగ్గానే పట్టుకున్నారన్నది నా పరిశీలన.

ప్ర :- ఆంధ్రా నుంచి అమెరికా వొచ్చిన తరువాత మీ ధృక్పథంలో ఎలాంటి మార్పులు చోటు చేసుకున్నాయి? అమెరికా జీవితం... మీ మీద, మీ రచనల మీద ఎలాంటి ప్రభావం చూపుతోంది. ముఖ్యంగా మీరు ఇండియాలో చేసిన రచనలకీ, ఇక్కడ చేస్తున్న రచనలకి ఏమైనా తేడా గమనించారా?

జ :- ఆంధ్రాలో ఉన్నా, అమెరికాలో ఉన్నా ఒక రచయిత బేసిక్ ధృక్పథం ఏదయితే ఉందో అది మారాల్సిన పని లేదు. అయితే అమెరికా దేశం పట్ల, ఆ దేశంలో జీవన ధానం పట్ల మనలో మొదట్నుంచీ పేరుకుపోయిన అభిప్రాయాలు మారవచ్చు లేదా ఇండియాలో వొస్తున్న మార్పులు అర్ధం కావడాకి దోహదం చేయవచ్చు. ఇండియాలో ఉన్నప్పుడు రాసినదానికి, అమెరికాలో ఉన్నప్పుడు చేసిన రచనలకి తేడా ఉంది. ఆ తేడా ఇతివృత్తానికి సంబంధించినది. ఏ రచయితైనా తను ఏ సమాజంలో నివశిస్తున్నాడో, అందులో నుంచి ఇతివృత్తాలను ఎన్నుకుంటాడు. నేను చేసిన పని కూడా అదే. ఆంధ్రాలో ఉన్నప్పుడు నేను 'అమ్మకో ఉత్తరం' కథ రాయాల్సిన అవసరం కలగదు. 'ఎండమావులు', 'టింకూ ఇన్ టెక్సాస్' లాంటి కథలు నా ఆలోచనల్లోకి వొచ్చే అవకాశం తక్కువగా వుండొచ్చు. తప్పని సరిగా అవి ప్రవాసంలో ఉండటం వల్ల వొచ్చిన కథల నేను నమ్ముతున్నాను. ఇండియాలో నేను గడిపిన జీవితాకి, లేదా నా చుట్టూ ఉన్న వాతావరణాకి, అమెరికాలో నేను గడిపిన జీవితాకి చాలా తేడా ఉంది. ఇండియాలో నిరంతరం బిజీగా ఉండే ఉద్యోగం, ఇతర వ్యాపకాలు. అమెరికాలో గడిపిన మూడేళ్లు అందుకు భిన్నమయింది. అక్కడ దొరికిన ఖాళీ సమయంలో నా జీవితాన్ని తరచి చూసుకునే అవకాశం కలిగింది. ప్రపంచ దేశాల సాహిత్యాన్ని చదవడం, వివిధ భాషల్లో సినిమాలు చూడటం, స్త్రీలకి సంబంధించి, మీడియాకి సంబంధించి వర్క్ షాపులలో పాల్గొనడం నా ఆలోచనల మార్చాయి. నా అవగాహనకు తోడ్పడ్డాయి. ముఖ్యంగా అమెరికాలో ప్రవాస స్త్రీలకి సంబంధించిన అనేక అంశాలు, నిజాలు తెలుసుకోగలిగే అవకాశం కలిగింది. అవన్నీ కూడా అమెరికాలో ఉండి నేను రాసిన కథల్లోను, కాలమ్స్‌లోను, వ్యాసాల్లోను ప్రతిఫలించాయి.

ప్ర :- పాఠకుల స్పందనలను బట్టి, సాహిత్యానికి ఉండే వేదిక లేదా డయాస్ కూడా రచయితలపై కొన్ని సార్లు ప్రభావం చూపిస్తుందంటారు...మరి ఇక్కడి సాహిత్య వాతావరణం, ప్రవాస పాఠకుల అభిరుచులు, అభిప్రాయాల పట్ల మీ పరిశీలన చెప్పండి ?

జ :- అది నిజమే, మన డయాస్ ఏమిటి? మనం ఎవరి కోసం రాస్తున్నాం, మన రచన చదివే పాఠకులు ఎవరు అనేది మనం రచన చేస్తున్నప్పుడు తప్పని సరిగా తలెత్తుతాయి. కళ కళ కోసమే అనేది సరి కాదని నా భావన. అందరికీ నచ్చే, అందరినీ మెప్పించే, అందరికీ ఆమోద యోగ్యమైన రచన చెయ్యాలని నేను ఎప్పుడూ అనుకోలేదు. నేను రాసేటప్పుడు నా పాఠకులెవరో నాకు తెలుసు. అలాగే, ఫలానా రచయిత ఏం రాస్తుందో, అమె

ధృక్పథం ఏమిటో పాఠకులకు కూడా తెలుసు కాబట్టి పాఠకులకి సంబంధించిన అవగాహన రచయిత మీద పని చేస్తుంది. అది తప్పని సరిగా నా మీద కూడా ఉండొచ్చు.

అమెరికాలో సాహిత్య వాతావరణం ఓ చోట ఆగిపోయిందా ?! ఆంధ్రాలో సాహిత్య వాతావరణానికి, వాదవివాదాలకి దూరంగా ఉందా ? అది కచ్చితంగా చెప్పలేం. ఎందుకంటే, ఏ సాహిత్యమైనా ఆ సమాజం నుంచే పుడుతుంది. తెలుగు సమాజంలో ఉద్యమాలు, వాదాలు అనివార్యమయ్యాయి. వీటి అవసరం అమెరికాలో లేకపోవచ్చు. అమెరికాలో ఎక్కువ మందికి నన్నయో, తిక్కనో, విశ్వనాథో ఆరాధ్య రచయిత కావచ్చు. అది వారి వెనకబాటుతనంగా కాకుండా వారి వారి వ్యక్తిగత అభిరుచిగానే మనం గుర్తించాలి. స్త్రీవాద సాహిత్య అవసరం అక్కడి తెలుగు సమాజంలో లేకపోవచ్చు. అంత మాత్రాన స్త్రీ, దళిత, మైనారిటీ వాదాలను వాళ్లు చిన్న చూపుతో చూసి విమర్శించాల్సిన పని లేదు. చదివి అర్థం చేసుకోగల సంస్కారం ఉంటే చాలు. 'అసలు స్త్రీవాదంతో పనేంటి ? ఇద్దరూ సమానమైనప్పుడు...', అని వాదించే రచయితలు, రచయిత్రులు కూడా కొందరక్కడ ఉన్నారు. తెలుగు గడ్డ మీద నిలబడ్డ వాళ్లకు అవసరమేమిటో అర్థమవుతుంది కానీ, ఆ సమాజానికీ, అక్కడి సమస్యలకు దూరంగా బతికే వాళ్లకు, ఆ అణచివేత, ఆ వివక్ష అర్థం కావాల్సిన రీతిలో అర్థం కాకపోవచ్చు. నేను రాసే శైలి, ఎంచుకునే ఇతివృత్తాలు ఇండియాలో వాళ్లకి కామన్‌గానే కపించవచ్చు. కానీ అమెరికన్ తెలుగు సాహిత్య వాతావరణంలో అదొక తీవ్రంగా కనిపిస్తుంది. ఇంత తీవ్రత ఇక్కడ పనికి రాదంటూ సన్నాయి నొక్కులు నొక్కేవారుండొచ్చు. ఆడవాళ్లు నిండుగా పట్టుచీర కట్టుకు, స్వయానా వండి అతిథి అభ్యాగతులకు వొడ్డించడమే సాంప్రదాయంగా భావించే చోట, అమెరికా పెళ్లిళ్లు విఫలమవుతున్న విషయమో, అమెరికాలో సగం మంది ఆడవాళ్లు డిప్రెషన్‌తో బాధపడుతున్న విషయం మీద చర్చిస్తే దాన్ని అవగాహన చేసుకునే పరిణతి వాళ్లకి ఉండక పోవచ్చు. ఇండియా నుంచి అమ్మాయిలు తెలివి మీరి పోయి, అమెరికా రావడం కోసం గ్రీన్ కార్డు ఉన్న అబ్బాయిల్ని పెళ్లి చేసుకుని, ఎయిర్ పోర్టులలోనే ఒదిలేసి వెళ్లిపోతున్నారన్న కామెంట్స్ కూడా నేను విన్నాను. వారికున్న అవగాహన ఇంతేలే అని సరిపెట్టుకోవడం తప్ప, అలాంటి సందర్భాల్లో మనం చేయగలిగిందేమీ ఉండదు. మన చుట్టూ ఉన్న సాహిత్య పాఠకుల స్థాయిని బట్టి మనం మాట్లాడాల్సి ఉంటుంది. అలాంటప్పుడు చాలా సార్లు రచయిత తన అభిప్రాయ్నా నిష్కర్షగా చెప్పడం ద్వారా అందరి దృష్టిలో వివాదాస్పదం కావచ్చు. లేదా అసలా రచయిత మాట్లాడకుండా ఉండటం ద్వారా తనను తానే నియంత్రించుకోవచ్చు...అంటే సెల్ఫ్ సెన్సార్‌షిప్ లాంటిదన్న మాట.

ఇటీవల బుకర్ ప్రయిజ్ గెలుచుకున్న కిరణ్ దేశాయ్ సంగతే చూడండి, 'ది ఇన్‌హరిటెన్స్ ఆఫ్ లాస్' పుస్తకం ఆమె పదిహేను వందల పేజీల్లో రాసింది. రచయిత ఏ విషయాన్నీ అనవసరంగా రాయడు. కానీ ఆ పుస్తకాన్ని పబ్లిషర్లు మూడు వందల పేజీలకు కుదించారు. ఆ ఎడిట్ చేసిన భాగాల్లో చాలా ముఖ్యమైన అంశాలు పోయాయని, కొన్ని చోట్ల గ్యాప్స్ కూడా కనిపించాయని స్వయంగా రచయిత్రి కిరణ్ దేశాయ్ తల్లి, అనితా దేశాయ్ కూడా ఒప్పుకున్నారు. రచయిత మీద మార్కెట్ శక్తులు కూడా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఎలాంటి సెన్సార్‌షిప్‌ని విధిస్తాయో ఇదొక ఉదాహరణ మాత్రమే.

ప్ర :- ప్రవాసజీవితం గురించి వొస్తున్న అనేక రచనల్లో, ముఖ్యంగా భారతదేశం నుంచి వొచ్చి ఇక్కడ జీవితాల్ని ఆవిష్కరించే ప్రయత్నం చేస్తున్న రచనల్లో వాస్తవికత కొంత వరకు లోపిస్తోందనే ఒక ఆసక్తికరమైన పరిశీలనను ఈ మధ్య మీరు రాసిన ఒక వ్యాసంలో చదివాను...దీపై మరింత విశ్లేషణ...

జ :- చాలా మంది అమెరికన్‌లు ఇండియా వెళ్లి వొస్తారు. మూడు నెలలో, ఆరు నెలలో హైదరాబాద్‌లో గడిపి వొచ్చి ఇండియా గురించి గొప్పగా చెపుతుంటారు. వాళ్లకి తెలిసిన ఇండియా వేరు, అక్కడ పుట్టి పెరిగిన మనకి తెలిసిన ఇండియా వేరు. వాళ్లు ఇండియాలో ఉన్న కొద్ది కాలం హైదరాబాద్‌లోనో, చెన్నైలోనో ఫైవ్‌స్టార్ హొటల్‌లో ఉండి, పర్యాటక ప్రదేశాల్ని చూసి వెళ్లిపోతారు. వాళ్లకి ఇండియా ఓ అందమైన స్వప్నంలా కనిపించవొచ్చు. మన దేశం నుండి అమెరికా చూడటానికి వెళ్లి వొచ్చే రచయిత పరిస్థితి కూడా అంతేనని నా అభిప్రాయం. వాళ్లా కొద్ది కాలం ఎవరింట్లోనో గెస్టులుగా ఉంటారు. ఎవరైనా రైడ్ ఇస్తేనో, ఎయిర్ ఫేర్ ఇస్తేనో నాలుగు ఊళ్లలో సాహిత్య సభల్లో మాట్లాడి వెళ్లిపోయి, నా అమెరికా యాత్రా విశేషాలు పేరిట కవితలో, వ్యాసాలో రాస్తుంటారు. వాళ్లకా కొద్ది రోజుల్లో కనిపించేది అమెరికాలో పైపై జీవన విధానం మాత్రమే. నాలుగు రుతువుల్లోను ఇక్కడ గడిపేవారికి, నిత్య జీవితంలో ఎదురయ్యే అనుభవాలు, అనుభూతుల లోతైన పరిశీలన వేరు. ఈ తేడా మనం స్పష్టంగా వారి వారి రచనల్లో చూడొచ్చు. ఇక్కడి సభల్లో చాలా మంది లేవనత్తే మరో అంశం కూడా నేను ఆ వ్యాసంలో చర్చించాను. అసలు అమెరికా రాకుండానే , అమెరికాలో జీవితం గురించి రచయితలు తమ రచనల్లో చేసే వ్యాఖ్యల గురించి, చాలా మందికి అభ్యంతరాలున్నట్టు నేను గమనించాను. నా పరిధి కేవలం రచయిత్రులకు పరిమితం చేసి ఆ అంశాన్ని కూడా నేను నా వ్యాసంలో చర్చించాను.

ప్ర :- తెలుగులో వొస్తున్న 'డయస్పోరిక్' రచనలపై మీ అభిప్రాయం ?

జ :- డయాస్పోరా అనే పదాన్ని నిర్వచించుకోవడంలోనే మన వాళ్లకు ఇంకా రకరకాల అభిప్రాయాలున్నాయి. మిగతా భాషల్తో పోలిస్తే, తెలుగులో నిజంగా ప్రవాసాంధ్ర జీవితాన్ని లోతుపాతులు చూసిన రచనలు చాలా తక్కువనే చెప్పొచ్చు. డయస్పోరా రచనలు రావడానికి కావాల్సిన వాతావరణం ఇక్కడ ఇప్పుడిప్పుడే నెలకొంటోంది. డయస్పోరా రచనల్ని ప్రోత్సహించే ఉద్దేశంతో 'ఈమాట' పూర్తి స్థాయిలో కృషి చేస్తోంది. వెబ్ మ్యాగజైన్లు, ఇంటర్నెట్ చర్చా వేదికలు ఇవన్నీ కూడా డయస్పోరా రచనలు చేయడాకి అవసరమైన వాతావరణాన్ని ఏర్పరుస్తున్నాయి. వీటి ప్రభావం ఎలా ఉంటుందో ఇప్పుడిప్పుడే చెప్పలేం.

ప్ర :- అమెరికాలో సాహిత్య, సాంస్కృతిక రంగాలలో 'జెండర్ సెన్సిటివిటీ' ఎంత వరకు ఉంటోందంటారు?

జ :- పైకి కపించకుండా అంతర్లీనంగా ఉంది. స్త్రీల రచనల్ని గుర్తించనట్లు మౌనంగా ఉంటారన్న విషయాన్ని నేను గమనించాను. పేర్లు చెప్పక్కర్లేదు కానీ, ఓ నవలా రచయితకి అవార్డు వొస్తే ప్రశంసలతో ముంచెత్తిన సాహితీ వేత్తలు, ఓ ప్రముఖ రచయిత్రికి అవార్డు వొస్తే మౌనంగా మిన్నకున్నారు. చికాగోలో జరిగిన ఆటా సభల్లో నా అనుభవం ఒకటి చెపుతాను. దివ్య హత్య జరిగిన కొత్తల్లో ఆ సభలు జరిగాయి. మీడియా మీద ఓ

చిన్న మీటింగ్. దివ్యను భర్త రంపంతో ముక్కలు ముక్కలుగా కోసి గార్బేజ్ దగ్గర పడేసిన వార్త అమెరికాలో, ఇండియన్ న్యూస్ పేపర్లలో, ఫస్ట్ పేజ్‌లో ప్రచురించడం వల్ల మన పరువు పోయిందంటూ కొందరు వక్తలు మాట్లాడారు. అసలలాంటి కిరాతకపు పనులు మానవ సమాజంలో జరగటం సిగ్గు చేటా ? ఆ వార్త రావడం సిగ్గు చేటా?

ప్ర :- తూర్పూ పడమరల మధ్య నిలబడి, ఒక రచయిత్రిగా, కవయిత్రిగా ప్రస్తుతం ఏం మాట్లాడాలనిపిస్తోంది?

జ :- వలసలనేవి ఇవాళ సహజము, అనివార్యమూ అయివుండొచ్చు. కానీ అందులో వేదన గురించి మాట్లాడుకోవాలి. మనం మన మూలాలకు దూరమవుతున్న వాస్తవికతనుంచి ప్రపంచాన్ని చూసినపుడు సొంత ఇల్లు, సొంత ఊరు అనేవి చెదిరిపోతూ కపిస్తున్నాయి. వలస జీవులదిప్పుడు అనేక సంస్కృతులు కలగలిపిన అస్థిత్వమైంది. అన్ని సంస్కృతులు మనవే. కానీ ఏ ఒక్కటీ మనది కాదు. అన్ని ప్రదేశాలూ మనవే. కానీ మన కంటూ ఓ సొంత ఊరు లేదు. అన్ని చోట్లా మనుషులుంటారు. కానీ మన కోసం ఆలోచించే, మనల్ని ప్రేమించే మనుషులుండకపోవచ్చు. తూర్పు, పడమర రెండిట్లో కూడా నాకు నేనే అవుట్ సైడర్‌గా కపిస్తున్నాను. అమెరికాలో ఉన్నంత కాలం.. ఇది నా ఊరు కాదు, ఇది నా భాష కాదు, ఇది నా సంస్కృతి కాదు అన్న భావన. ఎప్పుడెప్పుడు వెళ్లిపోదామా అన్న ఆరాటం. ఇప్పుడు హైదరాబాద్ వస్తే, మూడేళ్లలో ఎంత మార్పో చెప్పలేం. అంతా మారిపోయింది. బంగారం, బట్టలు, కంప్యూటర్లు, కర్రీపాయింట్‌లు, మొబైల్ ఫోన్‌లు, ఎఫ్ఎమ్ ధ్వని తరంగాలు ఇది ఇప్పటి హైదరాబాద్. నేను చూస్తూ ఉండగానే ఈ హైదరాబాద్ మారిపోయింది. కానీ ఏ మార్పు ఎప్పుడు వొచ్చిందో, ఎందుకు వొచ్చిందో నేను చెప్పలేను. ఆ మార్పు జరిగిన ప్రాసెస్‌లో నేను లేను కాబట్టి. ఇప్పుడు నా దేశంలో వాళ్లకి కేవలం నేనొక అవుట్ సైడర్… నేనొక ప్రవాసిని … ఇక్కడ, అక్కడ రెండు చోట్లా నేను అవుట్ సైడర్ అనే వాస్తవికత అస్థిమితంలోకి నెట్టేస్తోంది.

***

అమెరికాలో ఉన్నా, ఆంధ్రాలో ఉన్నా మన జీవితాలు మనకి కూడా పరాయిగా అనిపించే దశలో ఉన్నాయని ఆమె చెప్పడం మనందరి 'కల్పన'లో కఠోర సత్యంగా అపించడం లేదూ…

# ఒక అనాది నేరం

- లెనార్డ్ పెల్టియర్

మనం ఒక్కొక్కరం
అమాయకత్వంతో మొదలవుతాం.
మనందరం
నేరస్తులవుతాం.

యీ ప్రపంచంలో
నువ్వు నువ్వయినందుకు
నేరస్తుడవుతావు.

నువ్వు నువ్వుగా ,
ఒక మూలవాసి గావడం
అదే నీ ఆదిమ నేరం.

అన్నింటికన్నా
హీనమైన ఆ నేరానికి
నువ్వెన్నడూ క్షమించబడవు.

మనం యిండియన్స్మి
అందరమూ నేరస్తులం.
మనలా వున్నందుకు నేరస్తులం.
పుట్టినప్పట్నుంచీ మనకు
నేర్పిన నేరభావన
మనం బాగా నేర్చుకున్నాం కూడా!

యీ నేరభావనను గర్వించమని
నా అక్క చెల్లెండ్లకూ

నా అన్న దమ్ములకూ
మనవి చేస్తున్నా!

నా యిండియన్ సోదరీ సోదరులారా!
యీ నేరం చేసినందుకు గర్వించండి!

మీ అమాయకత్వ మీ నేరం!
మీరు మీరుగా వుండడం మీ నేరం!
మీరు యిండియన్స్ కావడం మీ నేరం!
మీరు మనుషులు కావడం మీ నేరం!

మీ యీ నేరం
మిమ్మల్ని పరిశుభ్రుల్ని చేస్తుంది!

(నా జీవితం నా ప్రజల కోసం ప్రార్థన !!!)

**లెనార్డ్ పెల్టియర్** అమెరిక క్రూరమైన జాతి వివక్ష చట్టాలకు బలయిన నేటివ్ అమరికన్ యోధుడు – AIM (American Indian Movement) నాయకుడు. గత 30 యేండ్లుగా చెయ్యని నేరానికి మరణ శిక్ష విధించబడి జైలులో మగ్గి పోతున్న స్వాతంత్ర్య పోరాట యోధుడు – అతని జైలు రాతలు – నా జీవితమే నా సూర్య నృత్యం (My Life is My Sun Dance) లో అతని కవితలకివి స్వేచ్ఛానుసరణ.

## 2006 సాహిత్య నోబెల్ గ్రహీత - ప్రజాస్వామిక లౌకిక విలువల కోసం నిలబడ్డ ఒర్హాన్ పాముక్!

సాహిత్యవార్త:

2006 సంవత్సరానికి గాను సాహిత్యం లో అత్యంత ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి ని ప్రఖ్యాత టర్కీ నవలా రచయిత ఒర్హాన్ పాముక్‌కి ప్రదానం చేస్తూ స్వీడిష్ అకాడెమి 'తను పుట్టి పెరిగిన నగరం విషాద ఆత్మను ఆవిష్కరించేందుకు పాముక్ విభిన్న సంస్కృతుల సంఘర్షణలకూ, సమ్మేళనాలకూ సాహిత్యంలో కొత్త చిహ్నాలు కనుక్కున్నాడు' అంటూ ప్రశంసించింది.

అతని నవలలో 'నా పేరు ఎరుపు' (My Name is Red) అంతర్జాతీయంగా బాగా ప్రాచుర్యం లోకి వచ్చింది. యిరవై నాలుగు భాషల్లోకి అనువదించబడి అనేక బహుమతులను పొందింది. తర్వాత రాసిన 'మంచు' (Snow), 'ఇస్తాంబుల్ - ఒక నగరం జ్ఞాపకాలు' (Istanbul – A City of Memories) నవలలు బాగా ప్రాచుర్యం లోకి వచ్చి పాముక్ కి అంతర్జాతీయంగా మరింత పేరు ప్రఖ్యాతులు సంపాదించి పెట్టినయి.

పాముక్ 1990 లో రాసిన 'నల్ల పుస్తకం' (Black Book) నవల టర్కీ సాహిత్యంలో బాగ వివాదాస్పదమైన రచనగా పేరు పొందింది. దాని సంక్లిష్టతవల్ల, జీవితాన్ని చాలా బలంగా వ్యక్తీకరించిన పద్ధతి వల్లా ఆ నవల టర్కీ లో గొప్ప పేరు ప్రఖ్యాతులు సంపాదించుకుంది. అతని ఇటీవలి నవల 'మంచు' ఆధునిక టర్కీ లో యిస్లాం వాదానికీ పాశ్చాత్య వాదానికీ మధ్య ఘర్షణనీ విలువల సంఘర్షణనీ అత్యంత ప్రతిభావంతంగా చిత్రీకరించింది. 'న్యూ యార్క్ టైంస్' పత్రిక 'మంచు' ని 2004 లో పది గొప్ప పుస్తకాల్లో ఒకటిగా పేర్కొంది.

ఒర్హాన్ పాముక్ ని ఆధునికానంతర నవలా రచయితగా పేర్కొనవచ్చు. అతని నవలల్లో ఆధునికానంతర వాదానికి సంబంధించిన అనేక అంశాలు కనబడతాయి. ఐరోపా పాశ్చాత్య విలువలకూ యిస్లాం వాద విలువలకూ మధ్య ఘర్షణ వల్ల తలెత్తుతున్న గందరగోళాన్నీ , పోగొట్టుకున్న అస్తిత్వాల్నీ పాముక్ తన నవలల్లో చిత్రీకరించాడు. తీవ్రంగా చలింపజేసే అతని రచనలు ఒక నిరంతర అస్థిరత్వాన్ని చిత్రిస్తాయి. సంక్లిష్టమైన కథాకథనమూ , బాగా లోతైన పాత్రల చిత్రణా పాముక్ నవలలో సర్వసాధారణంగా కనబడతాయి. పాముక్ కేవలం నవలా రచయితగానే కాకుండా మానవ హక్కుల గురించీ చరిత్రలో జరిగిన సామూహిక హత్యాకాండల గురించీ పట్టించుకున్న వొక సామాజిక రాజకీయ కార్యకర్తగా ముందుకొచ్చాడు. ఫిబ్రవరి 2005 లో 'దాస్ మాగజీన్' అనే స్విస్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో 1915-1917 ల మధ్య జరిగిన ఆర్మేనియన్ సాముహిక హత్యాకాండను వ్యతిరేకంగా , 30,000 మంది కుర్దుల వూచకోతకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు చేసాడు. ఆ ఇంటర్వ్యూ తర్వాత పాముక్ తీవ్రమయిన వేధింపులకు గురయ్యాడు. దేశాన్ని వదిలి వెళ్ళాల్సినంతగా

వేధింపులకు గురయ్యాడు. జూన్ 2005 లో టర్కీ ప్రభుత్వం 'ఏ టర్కీ పౌరుడైనా టర్కీ రిపబ్లిక్ ని గానీ, టర్కీ గ్రాండ్ నేషనల్ అసెంబ్లీ ని గానీ విమర్శిస్తూ మాట్లాడితే ఆరు నెల్ల నుండీ మూడేళ్ల వరకూ జైలు శిక్షకు గురి కాబడతారు' అనే కొత్త చట్టం చేసింది. దాని ప్రకారం తిరిగి తన స్వదేశానికి తిరిగి వచ్చిన పాముక్ పై అభియోగాలు మోపి బోనెక్కించింది. విచారణ ప్రారంభమైన తర్వాత కూడా పాముక్ తన వ్యాఖ్యలని పునరుద్ఘాటించాడు. '10 లక్షల మంది ఆర్మేనియనులూ 30,000ల మంది కుర్దులూ వూచకోతకు గురయ్యారు' అంటూ నిర్భయంగా ప్రకటించాడు. ప్రపంచవ్యాప్తంగా వచ్చిన నిరసనలకు టర్కీ ప్రభుత్వం పాముక్ పై మోపిన ఒక అభియోగాన్ని ఉపసంహరించుకుంది. 'టర్కీ తత్వాన్ని అవమానించాడు' అనే అభియోగం మాత్రం ఇంకా కొనసాగుతోంది.

సామాజిక, రాజకీయ అంశాల పట్ల , మానవ హక్కుల వుల్లంఘునలకూ, అధికార క్రూరత్వానికీ వ్యతిరేకంగా నిర్భయంగా అభిప్రాయ ప్రకటన చేసే రచయిత పాముక్ . విలువల, సంస్కృతుల సంఘర్షణనీ అత్యంత ప్రతిభావంతంగా చిత్రించిన నవలా రచయిత పాముక్. ఐరోపా వాదం ఆధిపత్యాన్నీ, యిస్లాం మత ఛాందస వాదాన్ని వ్యతిరేకించి ప్రజాస్వామిక, లౌకిక విలువల కోసం నిలబడ్డ ఆధునికానంతర నవలా రచయిత పాముక్ కు యీ యేడాది నోబెల్ రావడం ముదావహం.

# అయితే ఏంటి? పాలస్తీనా కవి: తాహా మహమ్మద్ అలీ

- సాజీ గోపాల్

ప్రపంచ సాహిత్యం:




పాలస్తీనా కవి తాహా మహమ్మద్ అలీ అరబిక్ భాషలో నాలుగు కవిత సంకలనాలు రాసారు. ఇటీవల ఆ నాలుగు సంకలనాల్లోంచి యేరిన కవితలతో "అయితే ఏంటి?" అనే కవితా సంకలనం ఆంగ్లంలోకి అనువాదం చేసి కాపర్ కాన్యన్ ప్రెస్సు ప్రచురించింది. పాలస్తీనా ప్రజల దీనావస్థలను, దశాబ్దాలుగా ఇజ్రాయిలీ దురాక్రణ లో జనం అగచాట్లను తాహా కొంత మృదువుగానూ , కొంత వినయ ధిక్కార స్వరంతోనూ తన కవితలలో చిత్రీకరించాడు. జెరుసెలం లో నివసించే పీటర్ కోల్ ఆ కవితలను అరబిక్ నుండి ఆంగ్లం లోకి అనువదించి, యిటీవల జరిగిన 'డాడ్జ్ పోయెట్రీ ఫెస్టివల్ ' లో గంభీరమైన స్వరంతో చదివి వినిపించాడు. ఈ పుస్తకంలో దాదాపు మూడున్నర దశాబ్దలుగా తాహా రాసిన కవితలున్నాయి.

గెలిలీ ప్రాంతంలోని అరబ్బు సమాజంలో తాహా కవిత్వం బాగా సుపరిచితమే. డబ్బై ఎనిమిది సంవత్సరాల వయస్సున్న తాహా ముడతలతో,స్పష్టమైన ముఖకవళికల తో అనుభవాల్ని పండించిన తాత లాగ కనిపిస్తాడు. మృదువైన మనస్సుతో వినయంగా, గంభీరమైన గొంతుతో కవితలు చదువుతాడు.

"నేను
కబేళ నుండి తప్పించుకున్న ఒంటెలా
తూర్పు దిక్కు పరిగెడుతున్నాను
కత్తుల కటారుల ప్రవాహం వెంబడిస్తున్నాయి "

తాహా కవితలలో ఆవేశం లేదు, కానీ మనస్సు హత్తుకునే ఆర్ధత వున్నది, వుద్రేకం లేదు కానీ వినయంతో కూడుకున్న భావోద్విగ్నత ఉంది.

డార్జ్ కవి సమ్మేళనం లో కలసినప్పుడు మేము కవి తాహకు ఒక ప్రశ్న వేసాం. “దశాబ్దాలుగా ఇజ్రాయిలీ ఆక్రమణ లో జీవించిన మీకు, దురాక్రమణ, పాలస్తీనా సామాజిక పరిస్థితులు మీ కవిత్వాన్ని ఎలా ప్రభావితం చేసాయి?”

తాహ ఇలా జవాబు చెప్పాడు. “ప్రపంచంలో ఎక్కడ కూడ దురాక్రమణ ఆనందంగా వుండదు, అది ప్రజల జీవితాన్ని నాశనం చేస్తుంది దుర్భరం చేస్తోంది.” అన్నాడు

ఒక అమెరికను అమ్మాయి తో వినయంగా మాట్లాడుతూ తాహ ఇలా అన్నాడు.
”పాలస్తీనా పరిష్కారమంతా అమెరికా చేతులలోనే వుంది. వాళ్ళు తలచుకుంటే వెంటనే పరిష్కరించ గలుగుతారు”

అప్పుడు నేను తాహతో ఇలా అన్నాను.
“మరి ప్రపంచ చరిత్రలో ఎక్కడకూడా ఒక సామ్రాజ్యవాది దయ వల్ల, దురాక్రమణ దారుడి కరుణ వల్ల ప్రజలు విముక్తి పొందలేదు. విముక్తి  కేవలం పోరాటం వలన సాధ్యమైంది కదాని “ అన్నాను.

ఆయన గంభీరంగా వొక చిరునవ్వు నవ్వాడు.

***

కవితలు : స్వేచ్ఛానువాదం

## అగ్రరాజ్యం పై పోరాడుతున్న అబ్దులా అల్ హైదీ

జీవితంలో అతను
చదవనూ లేదు రాయనూ లేదు
జీవితంలో అతను ఒక చెట్టునూ నరకనూ లేదు, ఒక దూడ గొంతు కోయనూ లేదు
జీవితంలో అతను పత్రికలను విమర్శించ లేదు గొంతెత్తి ప్రశ్నించనూ లేదు
కానీ ఒక మాటన్నాడు ”దయచేసి రండి  ఎన్వా అల్లా! కాదన కండి”

ఏది ఏమైనా కానీ అతని ఆశ  నిరాశవుతుంది
అతని పరిస్థితి చాలా దయనీయంగా వుంది
దేవుడిచ్చిన హక్కులన్నీ సముద్రంలో ఉప్పులాగా కలసిపోయినయి

న్యాయస్థానంలో కూర్చున్న
ఓ అమ్మలారా! ఓ అయ్యలారా!
శత్రువు గురించి నా క్లయింటుకి ఏమీ తెలియదు.
లోకం తెలియని అమాయకుడు అతను.

కానీ ఖచ్చితంగా ఒక విషయం చెప్పగలను
యుద్ధనౌకలోని సిబ్బంది నంతా కలిస్తె మిట్ట మధ్యాహ్నమైనా
కోడిగుడ్లు వండిపెట్టగలడు లాబ్నా వడ్డించగలడు!

( లాబ్నా అంటే ఆవు, గొర్రె, మేక పాలతో చేసిన అరబ్బు ఛీజ్ )

***

ఒక కవిత లో తాహా ఇలా రాసాడు.

“ ఖాసిం !
జాలిలేకుండా వాళ్ళు నిన్ను చంపే శారా ?
కాదులే నువ్వు హంతకులను మాయ జేసి తప్పించుకునే వుంటావు “!

***

# డేగ

ఎప్పుడైనా
విషాదమా!
ఏదో ఒక రోజు
నీనుండి నన్ను విముక్తి చేసుకోగలిగితే శక్తితే
నాకు వుంటే

అప్పుడు
నేను ఎమను కుంటానంటే
ఆత్మహత్య తో అతను అన్నీ బాధ్యలనుండి విముక్తి పొందాడని

ఎగిరిపోయిన పక్షుల గుంపు లా
పొలాలనుండి, కపాళాలనుండి పారిపోయిన గుడ్లగూబలా

ఒకవేళ అకస్మాత్తుగా
నీనుండి విముక్తి పొందగలిగితే

అప్పుడు ఏమి జరుగుంది?
ఇప్పుడు నిన్ను ఒదిలిపెట్టతే ఏమి జరుగుంది?
ఈ క్షణమే నిన్ను ఒదిలేసి పోతే
తాగుబోతు సారా దుకాణం ఒదిలి పోయినట్టుగా ....

నా బాల్యం లో
విషాదమా!
ఒక కోకిలను విషసర్పం కాటేయటం చూసాను
ఆ కోకిల మూగవోయింది
పక్షుల గుంపు గూడ దానిని ఒదిలివోయింది
పగులుతున్న ఆ కళ్ళలలో భయాన్ని చూసాను
అది తప్పించు కోవాలని ప్రయత్నిస్తోంది.
నేను ఎప్పుడూ మరచిపోలేను
అడవులు, చంద్రులు, కొలనులు
ప్రవాసం, ప్రవాహాలు మరియు కళ్ళల్లో దాగని ఆ పచ్చని ఉద్యానవనాలు
అన్నీ దాని మెడ చుట్టూ చుట్టు కున్నాయి.
ఒక మెరుపులో మాయమైపోయింది
ఆ కోకిల భయంతో కంపించుకు పోతుంది
అక్కడ మారణహోమాలు, నగరాలు కలగలసి
ఉధృతమైన వేగంతో, హింసతో దహించుకు పోతున్నాయి
ఆ కోకిల రెక్కలు తగలబడిపోతున్నాయి
అది ఏడుస్తోంది, వణుకుతోంది

బహుశ
భయం తో కంపిస్తున్న ఆ కోకిల
ఒంటరిది కాకపోవచ్చు
ఆ భయం ఒక్క కోకిలదే కాకపోవచ్చు
ఓ నా విషాదమా!

ఆ కోకిల భయం అర్ధం చేసుకోవటం కష్టమే

ఆ పక్షుల గుంపు భయం తప్ప.

***